# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 266 | హైదరాబాద్ | శుక్రవారం 17-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00




రష్యా, ఇరాన్ చమురుపై అమెరికా కీలక నిర్ణయం.. భారత్‌కు కొత్త సవాళ్లు 2లో

## తేజస్వి సూర్యపై పొన్నం
# ప్రభాకర్ ఆగ్రహం

- తెలంగాణ ఏర్పాటును భారత్‌పాక్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య
- తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం డిమాండ్
- బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న 2లో





# కరీంనగర్ 'నల్ల' గ్రానైట్..
# దర్యాప్తులో ఈడీ నత్తనడక!

12లో

- ₹750 కోట్ల స్కామ్.. ఏళ్లు గడిచినా తేలని విచారణ
- ఈడీ సోదాలు ఉత్తుత్తివేనా? మైనింగ్ మాఫియా వెనుక ఎవరు?
- మౌన ముద్రలో కేంద్ర మంత్రి.. ఏజెన్సీలపై మమకారం ఎందుకు?

(కరీంనగర్ ప్రతినిధి దారం.జగన్నాథ రెడ్డి)



## తెలంగాణలో టాప్ 3 కులాలు..
# నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం 2లో

# కొత్త దిశగా దేశం


- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి 2లో





## ఏపీ, తెలంగాణ మధ్య
# కొత్త రైళ్లు: రూట్లివే!

- చర్లపల్లినర్సాపురం, నర్సాపురం తిరుపతి మధ్య కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- ఇప్పటికే ఉన్న ప్రత్యేక రైళ్లను రెగ్యులర్ సర్వీసులుగా మార్చిన రైల్వే శాఖ
- ఇండోర్‌లింగంపల్లిఇండోర్ హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి వరకు పొడిగింపు
- ఏప్రిల్ చివరి వారం నుంచే అమల్లోకి రానున్న కొత్త రైళ్లు, మార్పులు 2లో



## అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా..
# సాయం చేసిన చైనా శాటిలైట్!


- గతేడాది రహస్యంగా శాటిలైట్‌ను సమకూర్చుకున్న ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్
- సౌదీ, జోర్డాన్, ఇరాక్‌లోని యూఎస్ బేస్‌ల కదలికలను ట్రాక్ చేసిన వైనం
- చైనా ప్రభుత్వ అనుమతితోనే ఇది జరిగిందంటున్న నిపుణులు
- ఇరాన్‌కు సైనిక సాయం లేదంటూ కొట్టిపారేస్తున్న చైనా 2లో

## తెలంగాణ సమాజానికి
# తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి

- తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడంపై ఆగ్రహం
- తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండటమేమిటని ప్రశ్న
- ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని మండిపాటు
- తెలంగాణ వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉందన్న కేటీఆర్
- తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీజేపీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ 2లో




# ఢిల్లీ ఎయిర్ పోర్టులో ఢీకొన్న రెండు విమానాలు



- ట్యాక్సీయింగ్ చేస్తుండగా ఆకాశ ఎయిర్ విమానాన్ని ఢీకొట్టిన స్పైస్‌జెట్ ఫ్లైట్
- హైదరాబాద్‌కు వెళ్లాల్సిన విమానానికి తప్పిన ప్రమాదం
- ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితం
- ఘటనపై విచారణకు ఆదేశించే అవకాశం 2లో

# ఏపీ, తెలంగాణ మధ్య కొత్త రైళ్లు: రూట్లివే!

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రయాణించే రైల్వే ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త వారపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లను క్రమబద్ధీకరించడంతో పాటు మరికొన్ని రైళ్ల సేవలను పొడిగించింది. దక్షిణ మధ్య రైల్వే విడుదల చేసిన వివరాల ప్రకారం చర్లపల్లినర్సాపురంచర్లపల్లి (17061/17062) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రకటించారు. ఇది ఇప్పటివరకు నడుస్తున్న ప్రత్యేక రైలు స్థానంలో రెగ్యులర్ సర్వీసుగా నడుస్తుంది. మే 2 నుంచి ప్రతి శనివారం రాత్రి 7:50 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:50 గంటలకు చర్లపల్లికి వస్తుంది. ఈ రైలు నల్గొండ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. అలాగే, నర్సాపురంతిరుపతినర్సాపురం (17428/17427) మధ్య మరో వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 27 నుంచి ప్రతి సోమవారం సాయంత్రం 3:50 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3:40 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మే 3 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 10:10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:30 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. ఇతర రైళ్ల సేవల్లో మార్పులు వీటితో పాటు రైల్వే బోర్డు మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇండోర్‌లింగంపల్లి హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (20916/20915) చర్లపల్లి వరకు పొడిగించారు. ఈ మార్పు ఏప్రిల్ 25 నుంచి అమల్లోకి వస్తుంది. కాకినాడ టౌన్ లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ను (12775/12776) వారానికి మూడు రోజుల నుంచి రోజువారీ సర్వీసుగా మార్చారు. ఈ రైలుకు సామర్లకోటలో అదనపు హాల్ట్‌ను కూడా కేటాయించారు. ఈ మార్పులు ఏప్రిల్ 21 నుంచే అమల్లోకి రానున్నాయి. ఈ కొత్త రైళ్లు, మార్పులతో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది.

## ఢిల్లీ ఎయిర్ పోర్టులో
# ఢీకొన్న రెండు విమానాలు

దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం సాయంత్రం పెను ప్రమాదం తృటిలో తప్పింది. ట్యాక్సీ వేపై ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్‌కు చెందిన రెండు విమానాలు ఒకదానికొకటి స్వల్పంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాశ్రయ వర్గాల సమాచారం ప్రకారం, స్పైస్‌జెట్‌కు చెందిన బోయింగ్ బీ737700 విమానం ట్యాక్సీయింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో హైదరాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఆకాశ ఎయిర్ విమానం క్యూపీ 1406 నిలిపి ఉంది. వేగంగా వస్తున్న స్పైస్‌జెట్ విమానం కుడి రెక్క (రైట్ వింగ్), నిలిపి ఉన్న ఆకాశ విమానం తోక భాగంలోని స్టెబిలైజర్‌ను తాకింది. దీంతో రెండు విమానాల భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై ఆకాశ ఎయిర్ వెంటనే స్పందించింది. తమ విమానం ఆగి ఉన్నప్పుడు మరో విమానం వచ్చి ఢీకొట్టినట్లు ప్రాథమికంగా తెలిసిందని సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. "ప్రయాణికులు, సిబ్బంది అందరినీ సురక్షితంగా విమానం నుంచి దించాం. హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. ఈ ఘటన కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు పెద్దగా అంతరాయం కలగలేదు. అయితే, దెబ్బతిన్న రెండు విమానాలను అధికారులు పరిశీలన కోసం బేకు తరలించారు. ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విచారణ జరిపే అవకాశం ఉంది.

# కొత్త దిశగా దేశం

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ @2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రమాదాల నివారణకు కలిసిపనిచేద్దాం

* డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి
* స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




కరీంనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 16(భారతశక్తి): రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కృషిచేద్దామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం అరైవ్ అలైవ్ లో భాగంగా రోడ్ సేఫ్టీ పై అవగాహన సదస్సు రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు ముఖ్య కారణమని పేర్కొన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు, శారీరక పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గడువు దాటిన వాహనాలను రోడ్లపైకి రాకుండా చూడాలని రవాణాశాఖ అధికారులకు సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ మద్యం తాగి వాహనాలు నడపకుండా చూడాలని పోలీస్ అధికారులు సూచించారు. వాహనదారులు బాధ్యతగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్ (ఆస్పత్రికి తీసుకెళ్లే) లోపు చేయాల్సిన ప్రాథమిక చికిత్స పై ప్రజలకు అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. మన పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆర్టీసీ ఆర్ఎం రాజు మాట్లాడుతూ.. మనదేశంలో ఏటా రెండు లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాలని వివరించారు. రవాణా శాఖ ఉప కమిషనర్ పెద్దింటి పురుషోత్తం మాట్లాడుతూ.. అతివేగం, అజాగ్రత్త, నిద్రలేమి, మైనర్లు వాహనాలు నడపడం కారణంగానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు.

ఎదిగిన పిల్లలు కళ్ళముందే చనిపోతే తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదరహిత తెలంగాణకు కృషి చేయాలన్నారు. డిఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీపీఆర్, ప్రథమ చికిత్స పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రహవీర్ పథకానికి శ్రీకారం చుట్టాయన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించే అన్ని ఆసుపత్రుల్లో రహవీర్ కింద రూ. లక్షన్నర వరకు వైద్య సహాయం అందిస్తారని వివరించారు. క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్పించిన వారికి రహవీర్ కింద 25 వేల బహుమతి అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులకు రోడ్డు భద్రతా నిబంధనలను విద్యార్థులు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నాటిక ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు, శాఖల అధికారులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యులు సిపిఆర్ చేసే విధానం చేసి చూపించారు. డ్రైవర్లకు సన్మానం రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాలు నడిపిన జిల్లాలోని ఆర్టీసీ, లారీడ్రైవర్లతో పాటు ప్రైవేటు విద్యాసంస్థల డ్రైవర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్డీవో మహేశ్వర్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ గండ్ర శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ వినోద్, సర్పంచ్ గుజ్జుల శ్వేతా రెడ్డి, రోడ్డు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# రష్యా, ఇరాన్ చమురుపై అమెరికా కీలక నిర్ణయం..

రష్యా, ఇరాన్‌ల నుంచి ముడి చమురు కొనుగోలు చేసేందుకు తాత్కాలికంగా ఇచ్చిన ఆంక్షల మినహాయింపులను పొడిగించేది లేదని అమెరికా స్పష్టం చేసింది. ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకుని భారత్ భారీగా చమురును దిగుమతి చేసుకున్న నేపథ్యంలో అమెరికా తాజా నిర్ణయం దేశీయ ఇంధన రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరాన్‌పై తిరిగి "గరిష్ఠ ఒత్తిడి" విధానాన్ని అమలు చేయడంలో భాగంగానే ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ... "రష్యా, ఇరాన్ చమురుకు సంబంధించిన జనరల్ లైసెన్స్‌ను మేము పునరుద్ధరించడం లేదు. మార్చి 11వ తేదీకి ముందే నౌకల్లోకి ఎక్కించిన చమురుకు మాత్రమే ఇది వర్తించింది. ఆ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది" అని తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ఇంధన ధరలను నియంత్రించేందుకు ట్రంప్ ప్రభుత్వం ఈ తాత్కాలిక మినహాయింపులు ఇచ్చింది. రష్యా చమురుకు ఇచ్చిన మినహాయింపు ఏప్రిల్ 11తో ముగియగా, ఇరాన్ చమురుకు ఇచ్చిన లైసెన్స్ ఏప్రిల్ 19తో ముగియనుంది. ఈ మినహాయింపుల వల్ల భారత్ గణనీయంగా లబ్ధి పొందింది. భారత రిఫైనరీలు ఈ కాలంలో రష్యా నుంచి సుమారు 30 మిలియన్ బ్యారెళ్ల చమురు కోసం ఆర్డర్లు ఇచ్చాయి. రిలయన్స్ వంటి ప్రధాన సంస్థలు సైతం రష్యా నుంచి కొనుగోళ్లను తిరిగి ప్రారంభించాయి. ముఖ్యంగా దాదాపు ఏడేళ్ల తర్వాత తొలిసారిగా ఇరాన్ నుంచి ముడి చమురుతో కూడిన రెండు భారీ ట్యాంకర్లు భారత ఓడరేవులకు చేరుకున్నాయి. 2019 మేలో ఆంక్షలు కఠినతరం కావడానికి ముందు భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 11.5 శాతంగా ఉండేది. అయితే, ట్రంప్ ప్రభుత్వం ఇచ్చిన ఈ మినహాయింపులపై అమెరికాలో ప్రతిపక్ష డెమోక్రాట్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. రష్యా తన యుద్ధానికి నిధులు సమకూర్చుకోవడానికి, ఇరాన్‌కు సహాయం చేయడానికి ఈ వెసులుబాటు ఉపయోగపడుతోందని సెనేటర్ రిచర్డ్ బ్లూమెన్‌థాల్ వంటి నేతలు ఆరోపించారు. ఈ ప్రమాదకర విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి కూడా అమెరికా తాజా నిర్ణయానికి ఒక కారణంగా కనిపిస్తోంది. ఈ పరిణామంతో భారత్ తన చమురు సేకరణ వ్యూహంలో కొత్త సవాళ్లను ఎదుర్కోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా.. సాయం చేసిన చైనా శాటిలైట్!

పశ్చిమాసియాలో ఇటీవల ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలో అమెరికా సైనిక స్థావరాలపై నిఘా పెట్టేందుకు ఇరాన్ చైనా తయారీ శాటిలైట్‌ను ఉపయోగించుకుందని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ పరిణామం గల్ఫ్ దేశాల్లో తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం, గతేడాది ఇరాన్ రహస్యంగా పొందిన ఈ శాటిలైట్ పేరు TEE01B. దీనిని చైనాకు చెందిన 'ఎర్త్ ఐ కంపెనీ' అభివృద్ధి చేసి ప్రయోగించింది. అనంతరం ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఏరోస్పేస్ విభాగానికి దీనిని అప్పగించారు. కక్ష్యలోకి విజయవంతంగా చేరిన తర్వాతే విదేశీ కొనుగోలుదారులకు ఉపగ్రహాలను బదిలీ చేసే 'ఇన్‌ఆర్బిట్ డెలివరీ' అనే పద్ధతిలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా బీజింగ్‌కు చెందిన ఎంపోశాట్ అనే మరో సంస్థకు చెందిన కమర్షియల్ గ్రౌండ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను కూడా ఇరాన్ వినియోగించుకునేందుకు అనుమతి లభించింది. ఈ శాటిలైట్‌ను ఉపయోగించి పశ్చిమాసియాలోని కీలకమైన అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ నిఘా పెట్టింది. మార్చి 13, 14, 15 తేదీల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ చిత్రాలను ఈ శాటిలైట్ బంధించింది. అదే సమయంలో జోర్డాన్‌లోని మువాఫక్ సల్తీ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్ సమీప ప్రాంతాలు, ఇరాక్‌లోని ఎర్బిల్ ఎయిర్‌పోర్ట్ వద్ద కార్యకలాపాలను కూడా ట్రాక్ చేసినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. కువైట్‌లోని క్యాంప్ బ్యూహ్రింగ్, అలీ అల్ సేలం ఎయిర్ బేస్ వంటి అమెరికా సంబంధిత స్థావరాలు కూడా దీని నిఘా నీడలోనే ఉన్నాయి. "చైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ చైనా కంపెనీ ఇలాంటి ఉపగ్రహాన్ని ప్రయోగించడం అసాధ్యం. చైనా చాలా కాలంగా ఇరాన్‌కు నిఘా సమాచారంతో సాయం చేస్తోంది, అయితే ప్రభుత్వ ప్రమేయం బయటపడకుండా జాగ్రత్త పడుతోంది" అని పాశ్చాత్య దేశాలకు చెందిన ఓ మాజీ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి వ్యాఖ్యానించారు. అయితే, ఇరాన్‌కు ఎలాంటి సైనిక మద్దతు ఇవ్వడం లేదని చైనా విదేశాంగ శాఖ గత కొన్ని రోజులుగా ఖండిస్తూ వస్తోంది. చైనా చాలా కాలంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి మద్దతు ఇస్తోందని, క్షిపణుల తయారీకి ఉపయోగపడే ద్వంద్వ వినియోగ పారిశ్రామిక భాగాలను అందిస్తోందని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనాఇరాన్ బంధంపై గల్ఫ్ దేశాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే... నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (No Caste) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.

# తేజస్వి సూర్యపై పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్ని అవమానించినందుకు ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ డీఎన్ఏ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు

భారత శక్తి

## ట్రంప్ ఇంట రచ్చ మొదలు

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచీ ఆయన పట్టిందల్లా వివాదమే అవుతున్నది. ఇంటాబయటా ఆయన నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. 'అమెరికా గ్రేట్ ఎగైన్' అంటూ అగ్రరాజ్యం పగ్గాలు అందుకున్న ట్రంప్ 'అమెరికాను గ్రేట్ చేయకపోయినా ఫర్వాలేదు, ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలుకుబడి తగ్గించకపోతే చాలు!' అనే పరిస్థితి ఏర్పడింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు ఇన్నాళ్లు శత్రువులకు మాత్రమే నచ్చలేదు. కానీ ఇప్పుడు సొంత దేశంలోని వారికి కూడా ఇష్టం లేదని తెలుస్తోంది. ఆసియా దేశాలకు చమురు సరఫరా కోసం కీలకంగా ఉన్న హార్మోజ్ జల సంధిని దిగ్బంధం చేస్తున్నట్లు ఇటీవల ట్రంపు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయం పై కొన్ని మిత్ర దేశాలతో సహా అమెరికా సైన్యం కూడా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. అసలు సైన్యం ఎందుకు వ్యతిరేకిస్తుంది? ట్రంప్ హార్మోజ్ దిగ్బంధంపై మిత్ర దేశాలు ఏమంటున్నాయి?ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య రగిలిన చిచ్చుతో అమెరికా ఎంట్రీ ఇచ్చి యుద్ధ వాతావరణన్ని నెలకొల్పింది. ఇప్పటికే ఇరాన్ పై ఎన్నో రకాల దాడులు చేసిన అమెరికా ఆ తర్వాత ఆ దేశ సుప్రీం లీడర్ ను అంతం చేసిన విషయం తెలిసిందే. అయితే యురేనియం పై ఆధిపత్యం తమది ఉండాలన్న అమెరికా కు ఇరాన్ వ్యతిరేకంగా నిలుస్తూ గట్టి పోరాటాన్ని చేస్తోంది. కొన్ని రోజులుగా సాగిన యుద్ధం తర్వాత ఏప్రిల్ 11న పాకిస్థాన్లోని ఇస్లామాబాదులో ఇరాన్, అమెరికా నేతల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. అయితే ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఆసియా దేశాలకు కీలక రవాణా మార్గం అయిన హార్మోజ్ జల సంధిని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం మోపారు. ఆ తర్వాత ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధానికి దిగారు. మిత్రులు, శత్రువులన్న తేడా లేకుండా అందరిపై భారీగా టారిఫ్‌లు విధించారు. వీటిని అమెరికా ఫెడరల్ కోర్టు కొట్టేయడంతో అమెరికా అధ్యక్షుడికి సొంత దేశంలో చుక్కెదురైంది. ఆ తర్వాత డ్రగ్ మాఫియాను నడుపుతున్నారన్న ఆరోపణలపై ఏకంగా వెనెజువెలా దేశాధినేతను రాత్రికిరాత్రి అరెస్టు చేశారు. అనంతరం పశ్చియాసియాలో పోరుకు ఆజ్యం పోశారు.ఇరాన్‌ను రెండు వారాల్లోపు అదుపులోకి తీసుకుంటానని భావించిన ట్రంప్ ఎంతకీ పైచెయ్యి సాధించకపోవడం, రోజూ వేల కోట్ల రూపాయల నష్టం వస్తుండటంతో ఐదు రోజుల విరామాన్ని ప్రకటించారు. ఆ తర్వాత విజయం తమదేనని స్వయంగా ప్రకటించుకొని శాంతి చర్చలకు మొగ్గుచూపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై యుద్ధం చేయాలన్న ట్రంప్ నిర్ణయంపై సొంత దేశంలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైకి వేరే కారణాలు చెప్తున్నప్పటికీ యుద్ధం వద్దని వారించినందుకే అటార్నీ జనరల్ పామ్ బొండిని, అంతకుముందు హోంల్యాండ్ సెక్యూరిటీ చీఫ్ క్రిస్టీ నోయిమ్‌ను పదవి నుంచి తప్పించారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అంతేకాదు, ఇరాన్ యుద్ధాన్ని మొదటినుంచి వ్యతిరేకిస్తున్న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చివరికి శాంతి చర్చలకు నాయకత్వం వహించాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఎడతెగని యుద్ధం వల్ల అమెరికాకు భారీగా నష్టం వాటిల్లుతున్నదని అమెరికన్లు విమర్శిస్తున్నారు. 'నో కింగ్స్' నిరసనలు వెల్లువెత్తిన విషయం విదితమే. 54 శాతం మంది అమెరికన్లు ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఇటీవల ఇప్సాస్ రాయిటర్స్ సర్వేలో వెల్లడవడం అందుకు నిదర్శనం. 24 శాతం ట్రంప్ చర్యను సమర్థించగా, 22 శాతం దీనిపై స్పందించడానికి విముఖత చూపారట. అధికార రిపబ్లికన్ పార్టీలోనూ 46 శాతం మంది ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని తేలడం గమనార్హం.రాన్ ఈ జలసంధి పై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. కొన్ని దేశాలకు చెందిన నౌకలను వెళ్లకుండా ఆపుతోంది. ఆయా దేశాలు టోల్ ఫీజు కడితేనే విడిచిపెడుతోంది. అయితే భారత్ తో సహా కొన్ని మిత్ర దేశాలకు ఇరాన్ ఎలాంటి ఫీజు లేకుండా నౌకలను విడిచిపెడుతోంది. ఈ సమయంలో ట్రంప్ ఎలాంటి నౌకలు వెళ్లకుండా చేస్తామని.. పూర్తిగా దిగ్బంధం చేసినట్లు చెప్పాడు. అయితే ఈ నిర్ణయం పై సొంత దేశ సైనిక అధికారులు వ్యతిరేకత తెలుపుతున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఒక సమస్య తొలగి పోవాలంటే పరిష్కారం గురించి ఆలోచించాలి. కానీ ట్రంప్ కొత్త సమస్యను సృష్టించడంతో ప్రపంచం అల్లకల్లోలంగా మారబోతుంది. ఇప్పటికే ఇరాన్ ను అమెరికా ఎన్నో రకాలుగా దాడులు చేసి ముప్పు తిప్పలు పెడుతున్నా.. ఎలాంటి భయాందోళన చెందడం లేదు. కానీ ఇప్పుడు ట్రంపు తీసుకునే నిర్ణయంతో మిత్రదేశాలు కూడా వ్యతిరేకంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది.కొన్ని వర్గాల వారి వస్తున్న సమాచారం మేరకు గల్ఫ్ దేశాలైన కువైట్ వంటివి అమెరికాకు మిత్ర దేశంగా ఉన్నా కూడా.. ట్రంప్ తీసుకునే నిర్ణయాలపై వ్యతిరేకంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నేరుగా ఇరాన్తో చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. ఇలా అమెరికాకు మిత్ర దేశాలుగా ఉన్నవి.. నేరుగా ఇరాన్తో చర్చలు జరిపి సఫలం అయితే అప్పుడు అమెరికా ఒంటరిగా మారే అవకాశం ఉంది. మరోవైపు అమెరికాలోని డాలర్ వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం కూడా ఉందని తెలుస్తోంది.ఇది ఇలా ఉండగా హార్మోజ్ జలసంధిని తాము దిగ్బంధం చేశామని చెబుతున్నా కూడా.. అమెరికన్ సైనిక బలగాలు ఇప్పటివరకు ఈ జల సంధి కి చేరుకోలేదన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్తో రెండో విడత చర్చలు ఉన్నట్లు ట్రంపు ప్రకటించడంతో.. అమెరికన్ సైనికులకు అయోమయంగా మారినట్లు తెలుస్తోంది. సొంత ప్రజలే వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఇకపై అయినా ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటారేమో వేచిచూడాలి.

## తండ్రి చాటు నుంచి.. తండ్రిని దాటేసే స్థాయికి నారా లోకేష్... ఒక్కో మెట్టు ఎక్కుతూ.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాకా...



విజయవాడ, ఏప్రిల్ 16

చంద్రబాబు కుమారుడు నారా లోకేష్‌కి వారసత్వమే మొదటి సవాల్ అంటే ఆశ్చర్యం కలగొచ్చు. కానీ చంద్రబాబు కుమారుడు టీడీపీ భవిష్యత్ నేతగా ఎదగాలంటే లోకేష్ ప్రతీ అడుగులో విమర్శలు, పోలికల పరీక్షలు నెగ్గాల్సొచ్చింది. రాజకీయ ఆసక్తి ఉన్న యువకుడిగా ఆయన అర్హతలు వాటిముందు తూగలేక పోయాయి. కార్యకర్తల సంక్షేమం మొదటి భాద్యతగా పార్టీలో అడుగుపెట్టి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఇప్పుడు పార్టీకి భవిష్యత్ నేతగా ఎదగటం ఆషామాషీ కాదు. 2013లో రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పుడు ఆయనపై 'వారసుడు' అనే ముద్ర బలంగా పడింది. ప్రతిపక్షాల నుంచి ఎదురైన వ్యక్తిగత విమర్శలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఆయన్ని మానసికంగా దెబ్బతీయాలని చూశాయి. ముఖ్యంగా ఆయన ప్రసంగ శైలి, తెలుగు ఉచ్ఛారణ మొదలు ను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు చేసిన విమర్శలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. కానీ, ఒకరకంగా ఆ విమర్శలే ఆయనను రాటుదేల్చాయి. లోకేష్ తన లోపాలను సరిదిద్దుకుంటూ, మౌనంగా తన పని తాను చేసుకుంటూ పోయారు.చంద్రబాబు నాయుడు పాలనపై దృష్టి పెట్టిన సమయంలో, పార్టీ క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సమన్వయం చేసే బాధ్యతను లోకేష్ భుజాన వేసుకున్నారు. 'కార్యకర్తల సంక్షేమ నిధి' ద్వారా వేలాది మంది కార్యకర్తలకు అండగా నిలిచారు. ఇది ఆయనకు పార్టీ కేడర్‌లో బలమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు, క్లిష్ట సమయాల్లో కార్యకర్త వెనుక నిలబడటమేనని ఆయన నిరూపించారు.2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోవడం లోకేష్ రాజకీయ జీవితంలో ఒక పెద్ద కుదుపు. కానీ, ఆ ఓటమి ఆయన్ని నిరుత్సాహపరచలేదు. ఆవిర్భావం నుంచీ పార్టీ ఒక్కసారి కూడా గెలుచుకోని స్థానాన్ని ఎంచుకోవడమే పెద్ద సవాలు. అన్నీ వడ్డించిన విస్తరిలో భుజించడం ఆయనకు తేలికే.. కానీ తన ప్రయత్నమే కార్యకర్తలకు స్పూర్తిగా నిలవాలనే యత్నమే ఆయన పట్టుదలకు నిర్దర్శనం. అందుకే గెలిచిన ప్రత్యర్థి కంటే ఎక్కువగా నియోజకవర్గంలో గడిపారు. ఓడినా అక్కడే ఉండి ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం ఆయన పట్టుదలకు నిదర్శనం. ఈ పట్టుదలే 2024లో అదే మంగళగిరి నుంచి రికార్డు మెజారిటీతో విజయం సాధించారు.నందమూరి, నారా వారసుడిగా లోకేష్ కు గుర్తింపు ఉన్నా.. యువ గళం పాదయాత్ర ఆయన్ను నాయకుడిగా మార్చింది. 4,000 కిలోమీటర్లకుపైగా సాగిన ఈ సుదీర్ఘ యాత్రలో అన్ని వర్గాల వారితో మమేకమయ్యారు, కార్యకర్తల మనోభావాలు తెలుసుకున్నారు. మండుటెండల్లో సైతం సాగిన ఈ యాత్రలో ఆయన తన మాట తీరును, బాడీ లాంగ్వేజ్‌ను పూర్తిగా మెరుగు పరచుకున్నారు. సమస్యలను అర్థం చేసుకోవడంలో లోకేష్ చూపిన చొరవ, ప్రత్యర్థుల విమర్శలకు ఆయన ఇచ్చిన కౌంటర్లు పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ పాదయాత్ర ద్వారా లోకేష్ తనను తాను ఒక మాస్ లీడర్‌గా ఆవిష్కరించుకున్నారు.చంద్రబాబు నాయుడు అనుభవం ఒక ఎత్తయితే, లోకేష్ ఆధునికత మరో ఎత్తు. లోకేష్ తనకంటూ ఒక ప్రత్యేకమైన టీమ్‌ను నిర్మించుకున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, నిమ్మకాయల విజయ్ లాంటి కొత్తతరం నాయకులను ప్రోత్సహిస్తూ పార్టీలో యువ రక్తాన్ని ఎక్కిస్తున్నారు. ఐటీ నిపుణులు, యువ మేధావులు, రాజకీయ విశ్లేషకులతో కూడిన ఈ బృందం పార్టీ ప్రచార శైలిని మార్చేసింది. డిజిటల్ మీడియాను ఉపయోగించుకోవడంలో, డేటా విశ్లేషణ ద్వారా నియోజకవర్గాల పరిస్థితులను అంచనా వేయడంలో టెక్నాలజీని అందిపుచ్చుకున్నారు లోకేష్. జెన్ - జెడ్ తరానికి తగినట్టు సోషల్ మీడియా వ్యూహాలు రచించే టీం ను ఏర్పాటు చేసుకున్నారు. ఎన్టీయార్, చంద్రబాబు తరం నాయకుల వారసులను చేరదీస్తూ భవిష్యత్ నాయకులతో పార్టీని సిద్ధం చేస్తున్నారు.గతంలో ఐటీ, పంచాయతీరాజ్ మంత్రిగా పనిచేసిన కాలంలోనే లోకేష్ తన పాలనలోనూ సమర్థత చాటుకున్నారు. గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణాలతో రికార్డు స్థాయి పనులుచేసారు. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై ఆయన దృష్టి సారించారు. రోజువారీ ప్రభుత్వ సేవల్లో సరళత తీసుకురావడం ద్వారా పనిచేసే ప్రభుత్వం అని నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్ సేవలు తీసుకురావడంలో జాతీయ స్థాయిలో ఏపీ ఆదర్శంగా నిలిచింది. దాంతోపాటు పెట్టుబడులు భారీగా ఆకర్శించాలనే తపన చూపుతున్నారు.

మర్రిచెట్టు నీడలో మరో చెట్టు ఎదగడం కష్టం. లోకేష్ తాత ఎన్టీఆర్ లాంటి ఆకర్షణ, చంద్రబాబు క్రమశిక్షణ,చాతుర్యం ముందు దిగదుడుపే. కానీ వారిని అందుకోవాలన్న ఆత్రంకన్నా తనదైన శైలిని ఏర్పరచుకోవాలనే పట్టుదల లోకేష్ లో కనిపిస్తుంది. చంద్రబాబు నాయుడు తర్వాత టీడీపీ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్నకు లోకేష్ తన పనితీరే సమాధానం అంటున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం కేవలం పదవి దక్కించుకోవడం కాదు లక్షలాది కార్యకర్తల ఆకాంక్షలను మోసే బాధ్యత.

## స్టీల్, సిమెంట్, కంకర లేకుండా ఇళ్లు

విజయవాడ, ఏప్రిల్ 16, (

ఇల్లు నిర్మించాలంటే స్టీల్, సిమెంట్, కంకర, ఇసుక వంటివి అవసరం. కానీ ఇవేవీ లేకుండానే పాతకాలం నాటి పద్ధతులలో ఇల్లు నిర్మించారు ఆర్కిటెక్ట్ కరుణాకర్ రెడ్డి. మూడున్నర వ్యవధిలోనే పాత పద్ధతిలో మోడ్రన్ ఎకో ఫ్రెండ్లీ ఇల్లు నిర్మించారు. ఈ విధానంలో సహజ వనరుల వినియోగం 70 శాతం తగ్గుతుందని చెప్తున్నారు. ఇల్లు కట్టే స్థలంలోని మట్టిని ఉపయోగించి, ఇలాంటి పర్యావరణహిత ఇల్లు కట్టినట్లు తెలిపారు.ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అనేది పెద్దల సామెత. ఇళ్లు కట్టాలన్నా, పెళ్లి చేయాలన్నా బోలెడు తతంగం ఉంటుందనేది దాని ఉద్దేశం. పెళ్లి సంగతి పక్కనబెడితే.. ఇల్లు కట్టాలంటే మాత్రం చాలా కావాల్సి ఉంటుంది. మనం కోరుకున్న రీతిలో, మనకు నచ్చిన విధంగా, పర్యావరణహితంగా ఇల్లు కట్టడమంటే చిన్నపాటి యజ్ఞం చేసినట్టే. ఇక ఇల్లు కట్టాలంటే ఇసుక, సిమెంట్, కంకర, స్టీల్ వంటి నిర్మాణ సామాగ్రి, వాటికి అయ్యే ఖర్చు తడిసి మోపెడు అవుతుంటుంది. అయితే ఇవేవీ లేకుండానే పాతకాలం నాటి పద్ధతులు ఉపయోగించి అధునాతనమైన , అందమైన పర్యావరణహిత ఇల్లు కట్టొచ్చని చెప్తున్నారు కరుణాకర్ రెడ్డి అనే ఆర్కిటెక్ట్. ఈ విధానంలో ఆయన ఇల్లు నిర్మించారు.స్కాట్లాండ్‌లో తన చదువు పూర్తి చేసిన కరుణాకర్ రెడ్డి.. పర్యావరణ అనుకూల ఇళ్లను నిర్మించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో.. కంకర, సిమెంట్, స్టీల్, ఇసుక వంటివి ఏవీ అవసరం లేకుండానే అందమైన పర్యావరణహిత ఇళ్లను నిర్మించవచ్చని నిరూపిస్తున్నారు. ఇల్లు కట్టే స్థలంలోని మట్టికి డంగు కలిపి.. ఈ ఎకో ఫ్రెండ్లీ ఇల్లు నిర్మించారు కరుణాకర్ రెడ్డి. మరోవైపు పాతకాలంలో భవనాలు ఎలా నిర్మించేవారో అలాంటి విధానాన్ని ప్రస్తుత తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇలా సంప్రదాయ పద్ధతిలో ఎకో ఫ్రెండ్లీ ఇళ్ల నిర్మిస్తున్నట్లు కరుణాకర్ రెడ్డి చెప్తున్నారు.సాధారణంగా ఇళ్ల కట్టే విధానంలో ప్లాస్టింగ్ చేస్తుంటారని.. దీని వలన వేడి ఉత్పత్తి కావటమే కాకుండా, కార్బన్ డై యాక్సైడ్ విడుదల అవుతుందని ఈయన చెప్తున్నారు. అలాగే ఇసుక, ఇటుక, కంకర వంటివి కావాల్సి వస్తుందని.. దీంతో వనరులు తగ్గిపోతున్నాయన్నారు. ఇలాంటివి పెద్దగా అవసరం లేకుండానే మనకు ఉన్న స్థలంలోని మట్టిని ఉపయోగించి, మన చుట్టూ ఉన్న వాటితోనే ఇల్లు కట్టినట్లు చెప్తున్నారు. పాతకాలం నాటి విధానాన్ని రీడిజైన్ చేసి మూడున్నర నెలలో ఇల్లు కట్టినట్లు తెలిపారు.మరోవైపు ఈ విధానంలో ఇల్లు కట్టాలంటే ముందుగా ఇల్లు కట్టే స్థలంలోని మట్టిని, నేల స్వభావాన్ని పరీక్షిస్తారు. ఆ తర్వాత ఆ ఇంటిని రాయితో కట్టాలా లేక పూర్తిగా మట్టిగోడలు సరిపోతాయా అనేది నిర్ణయిస్తారు. ఇంటిని కట్టే స్థలంలోని నేల స్వభావాన్ని అనుసరించి, రాతితో కట్టాలా, పూర్తిగా మట్టిగోడలు నిర్మించాలా, ఎంత ఎత్తులో గోడలు కట్టాలనే విషయాలను డిజైన్ చేసుకుంటామని కరుణాకర్ రెడ్డి చెప్తున్నారు. ఇంటి రూఫ్ నిర్మాణం విషయానికి వస్తే పాతకాలంలో మాదిరిగా దూలాలను ఏర్పాటు చేసి.. దానిపై డంగుతో కలిసి స్లాబ్ వేస్తామంటున్నారు. ఈ విధానంలో ఇల్లు కట్టడం ద్వారా సహజ వనరుల వినియోగాన్ని 70 శాతం వరకూ తగ్గించవచ్చంటున్నారు.ఈ విధానంలో సిమెంట్, ఇనుము బదులుగా సున్నం, మట్టి, కలప వంటి ప్రకృతి సిద్ధమైన పదార్థాలను ఉపయోగిస్తారు. దీంతో ఈ ఇల్లు వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటాయని.. మట్టి గోడలు సహజసిద్ధంగా వెంటిలేషన్ అందిస్తాయని అంటున్నారు.

## పెద్ద ఎత్తున అక్రమంగా నిర్వహించిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న కాంగ్రెస్ నేతలు

ఎల్బీ నగర్ ఏప్రిల్ 16, (

ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ కర్మాంగట్లో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని కాంగ్రెస్ నాయకులు పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి రేషన్ బియ్యం ఉన్న గోదాన్ని సీజ్ చేయించారు .టీపీసీసీ అధికార ప్రతినిధి స్థానిక కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి సూచన మేరకు శ్రీనివాస కాలనీ నందు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తలం తనిఖీలు చేసి పట్టుకోవడం జరిగిందని ఆ పార్టీ నేత ప్రవీణ్ తెలియజేశారు. అనంతరం సంబంధిత సివిల్ సప్లై శాఖ అధికారులకు,పోలీస్ అధికారులకు తెలియజేసారు. సంఘటనా స్థలానికి అధికారులు చేరుకొని సీజ్ చేయడం జరిగింది.ప్రజా ప్రభుత్వం అయిన రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్కరూ సన్నబియ్యం పొందాలనే లక్ష్యంతో వేలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సరఫరా జరుగుతున్న సమయంలో, కొంతమంది రేషన్ డీలర్లు డబ్బు కోసం ఆశపడి ఈ విధంగా అక్రమంగా బియ్యం అమ్మడం చాలా బాధాకరం అని ఆయన తెలిపారు.

పేద ప్రజల హక్కులను దోచుకుంటున్న ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, మళ్లీ ఈ విధమైన ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

## ఏడాదిలో 14 కోట్ల లడ్డూల విక్రయం

తిరుమల ఏప్రిల్ 16,తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. 2025-2026కు సంబంధించి 13,95,43,231 లడ్డూలను విక్రయించారు. 2025-2026 (ఏడాదిలో)లో అదనంగా 1.76 కోట్ల లడ్డూ ప్రసాదాలను విక్రయించారు. ఈ లడ్డూ విక్రయాల ద్వారా రూ.567 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది టీటీడీ ప్రస్తుతం రోజుకు 4 లక్షల వరకు లడ్డూలు తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ వివరాలు ఇలా ఉన్నాయితిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు ప్రతి రోజూ వేలాదిమంది భక్తులు దర్శించుకుంటారు. స్వామివారి దర్శనం తర్వాత లడ్డూ ప్రసాదాలను తీసుకుంటారు. గత ఏడాది కాలంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల విక్రయాలు భారీగా పెరిగాయి. 2025-2026 వార్షిక ఏడాదిలో రికార్డు స్థాయిలో లడ్డూ ప్రసాదాలు విక్రయించారు. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు మొత్తం 13,95,43,231 లడ్డూలను భక్తులకు విక్రయించారు. 2024-2025 విషయానికి వస్తే 12,18,53,535 లడ్డూలను అమ్మారు. 2024-2025తో పోలిస్తే.. 2025-2026 (ఏడాదిలో) అదనంగా 1.76 కోట్ల లడ్డూలను విక్రయించారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు 4 లక్షల లడ్డూలను తయారు చేస్తోంది.. శ్రీవారిని దర్శించుకునే ప్రతి ఒక్క భక్తుడికి ఒక లడ్డూను ఉచితంగా ఇవ్వడంతో పాటు అదనంగా కావాలనుకునే వారికి రూ. 50కి ఒకటి చొప్పున లడ్డూ అందిస్తోంది. 2025-2026 వార్షిక ఏడాదిలో లడ్డూల విక్రయాల ద్వారా రూ. 567 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది.తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక వసంతోత్సవాలు ఏప్రిల్ 30 నుంచి మే 02వ తేదీ వరకు భక్తి, వైభవాలతో ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముందు ఏప్రిల్ 29న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమం జరగనుంది. భక్తులు ఒక్కొక్కరు రూ.150/- చెల్లించి వసంతోత్సవ సేవలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరగనుంది. మూడు రోజుల పాటు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించబడుతుంది. రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులకు దర్శనమిస్తూ కటాక్షిస్తారు.వసంతోత్సవాలను పురస్కరించుకుని ఏప్రిల్ 28వ తేదీన ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం విశేషంగా నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమం చేపడతారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి మొదలైనవన్నీ పవిత్రజలంతో శుద్ధి చేయబడతాయి. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. ఈ ఉత్సవాల నిర్వహణ కారణంగా ఏప్రిల్ 28 మరియు ఏప్రిల్ 30 నుంచి మే 02వ తేదీ వరకు కళ్యాణోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ పద్మావతి అమ్మవారి కటాక్షాన్ని పొందాలని టీటీడీ కోరుతోంది.

# టీడీపీలో మూడోతరం

విజయవాడ, ఏప్రిల్ 16,

తెలుగుదేశం పార్టీ లో నారా లోకేష్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ గా పట్టాభిషేకం చేయడం కేవలం ఒక పదవి మార్పు మాత్రమే కాదు, అది పార్టీ చరిత్రలో మరో తరానికి పార్టీ బాధ్యతలు అప్పగించే ఘట్టంగా కనిపిస్తోంది. 44 ఏళ్ల పార్టీ చరిత్రలో తొలిసారిగా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని సృష్టించి లోకేష్‌కు అప్పగించడం ద్వారా, చంద్రబాబు నాయుడు తన వారసుడికి పార్టీ పగ్గాలను అధికారికంగా బదిలీ చేసే దిశగా బలమైన అడుగు వేశారు. 75 ఏళ్ల వయసులో ఉన్న చంద్రబాబు, పాలనపై దృష్టి సారిస్తూనే పార్టీ సంస్థాగత బాధ్యతలను లోకేష్‌కు అప్పగించడం ఒక వ్యూహాత్మక ప్రయత్నంఈ సంస్థాగత మార్పుల్లో లోకేష్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా యువతకు, అట్టడుగు స్థాయి నేతలకు పెద్దపీట వేస్తూ రూపొందించిన కొత్త కమిటీలు పార్టీలో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం వారసత్వ రాజకీయాలకే పరిమితం కాకుండా, యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల్లో సంపాదించుకున్న గుర్తింపు, ప్రస్తుతం ఐటీ మంత్రిగా చేస్తున్న అభివృద్ధి పనులు లోకేష్‌ను పార్టీలో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి. క్షేత్రస్థాయి కార్యకర్తలే నాయకులు అనే నినాదాన్ని నిజం చేస్తూ సామాన్య నేతలను కూడా పొలిట్‌బ్యూరోలోకి తీసుకోవడం లోకేష్ శైలికి నిదర్శనం.లోకేష్‌కు అత్యంత సన్నిహితులైన రాజేష్ కిలారు వంటి వారికి జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కీలక బాధ్యతలు అప్పగించారు. లోకేష్ టీమ్ ఇప్పుడు పార్టీ యంత్రాంగాన్ని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. పాత తరం అనుభవాన్ని గౌరవిస్తూనే, తనకంటూ ఒక బలమైన కోర్ టీమ్ ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి లోకేష్ సిద్ధమవుతున్నారు. ఇది పార్టీలో అంతర్గతంగా ఎటువంటి విబేధాలు రాకుండా సాఫీగా సాగుతున్న నాయకత్వ మార్పు. సామాజిక సమీకరణాల పరంగా కూడా ఈ మార్పులు అత్యంత వ్యూహాత్మకంగా ఉన్నాయి. 185 మందితో కూడిన రాష్ట్ర కమిటీలో 122 మంది వెనుకబడిన వర్గాలకు చెందిన వారికే ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా, టీడీపీ తన పాత సామాజిక పునాదులను మరింత పటిష్టం చేసుకుంటోంది. 40 శాతం బీసీలకు చోటు కల్పించడం ద్వారా బీసీల పార్టీ అనే ముద్రను తిరిగి చాటుకుంది. అలాగే మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా 50 మంది మహిళలకు కమిటీలో స్థానం కల్పించడం పార్టీ ఆధునిక దృక్పథాన్ని సూచిస్తోంది.ఈ మార్పులు 2029 ఎన్నికలే లక్ష్యంగా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. చంద్రబాబు మార్గదర్శకత్వంలో లోకేష్ ఇప్పుడు పార్టీకి ముఖ్య సేనాపతి గా మారారు. కేడర్ సంక్షేమం, డిజిటల్ నెట్‌వర్కింగ్, క్షేత్రస్థాయి బలోపేతంపై లోకేష్ చూపిస్తున్న ఆసక్తి టీడీపీని రాబోయే దశాబ్ద కాలం పాటు నడిపించేలా చేస్తోంది. ఈ పుత్రోదయం పార్టీకి కొత్త వెలుగునిస్తుందా లేదా అన్నది లోకేష్ భవిష్యత్తు వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది.

# ఆటలో 20 కోట్లు ...

తిరుపతి, ఏప్రిల్ 16,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన వైఫల్యాలు, అవినీతిని బయటపెడుతోంది కూటమి ప్రభుత్వం. ఇప్పటివరకు మద్యం కుంభకోణం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు మరో కుంభకోణం పై ఫుల్ క్లారిటీ వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భారీ అవినీతి జరిగిందని దర్యాప్తు లో తేలింది. రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ కీలక నివేదిక ఇచ్చింది. అప్పట్లో క్రీడల శాఖ మంత్రిగా ఆర్కే రోజా ఉండేవారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ శాప్ చైర్మన్ గా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఉండేవారు. ఇప్పుడు వారిద్దరి చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్టు తెలుస్తోంది. తప్పకుండా అరెస్టు ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. విజిలెన్స్ దర్యాప్తు పూర్తయింది. నివేదిక ప్రభుత్వానికి అందడంతో సీరియస్గా నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆడుదాం ఆంధ్ర పేరిట క్రీడా పోటీలు నిర్వహించారు. కానీ అప్పట్లో సుదీర్ఘకాలం కొనసాగాయి క్రీడా పోటీలు. క్రీడా పరికరాల కొనుగోలుతో పాటు నిర్వహణలోనూ అడుగడుగునా అవినీతి జరిగిందన్నది అప్పట్లోనే ఆరోపణలు వినిపించాయి. దీనిపై కూటమి అధికారంలోకి రాగానే విచారణ ప్రారంభం అయింది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. గత కొద్దిరోజులుగా ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో దర్యాప్తు కొనసాగింది. అయితే చివరిగా రూ.20.37 కోట్లు దోచుకున్నారని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ నిగ్గు తేల్చింది. అయితే ఇందులో ఆర్కే రోజా తో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాత్ర ఉన్నట్లు తేలింది. దీంతో వారి అరెస్టు తప్పదన్న ప్రచారం మొదలైంది.ఏదైనా కాంట్రాక్టు అప్పగించే ముందు అనుభవం, అర్హతలు పరిశీలిస్తారు. కానీ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణ కాంట్రాక్టును తగిన అనుభవం, అర్హతలు లేని తమ కుటుంబ సన్నిహితుడికి కట్టబెట్టారు మంత్రి ఆర్కే రోజా. అప్పటి శాప్ చైర్మన్ హోదాలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తన ప్రధాన అనుచరుడిని ముందు పెట్టి అక్రమాలకు పాల్పడ్డారని దర్యాప్తు సంస్థ నిర్ధారించింది. అప్పట్లో ఆడుదాం ఆంధ్రకు సోషల్ మీడియాలో ప్రచారం పేరిట కూడా వైసిపి ఇన్ఫ్లుయెన్సర్లకు భారీగా నగదు మొట్ట చెప్పినట్లు తేలింది. బ్రాండింగ్, వీడియో, ఫోటోగ్రఫీ ల పేరుతో భారీగా నిధులు దుర్వినియోగం చేశారని స్పష్టం చేసింది.. నాసిరకమైన క్రీడా పరికరాలతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని గుర్తించింది. మంత్రి రోజా, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, అతని ప్రధాన అనుచరుడైన శాప్ ఐటీ కన్సల్టెంట్ జీకే కిషోర్ బాబు పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసును ఏసీబీ లేదా సిఐడి కి అప్పగించాలని విజిలెన్స్ అండ్ అన్ఫోర్స్మెంట్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.ఆడుదాం ఆంధ్రాలో రోజాతో పాటు సిద్ధార్థ రెడ్డి అవినీతి చేశారని స్పష్టంగా తెలిసిపోయింది. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో ఐప్యాక్ సభ్యురాలికి ప్రచార ఖర్చుల నిమిత్తం భారీగా కేటాయించినట్లు గుర్తించింది దర్యాప్తు సంస్థ. ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం ప్రమేయంతోనే కేటాయింపులు చేసినట్లు గుర్తించడం విశేషం. ఈ మొత్తం వ్యవహారంలో రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి టార్గెట్ కానున్నారు అన్నమాట.

# గిరిజన నియోజకవర్గాలపై దృష్టి

కాకినాడ, ఏప్రిల్ 16,

ప్రతి రాజకీయ పార్టీ వ్యూహకర్తలను నియమించుకుంటోంది. కానీ జనసేనకు ఇంతవరకు వ్యూహకర్తలు లేరు. అయితే తాజాగా పార్టీ ఆ ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. జనసేన తరఫున ఓ బృందం ఉత్తరాంధ్రలో సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో ఈ బృందం పర్యటించి వివరాలు సేకరిస్తోంది. అయితే ఈ సర్వే బృందం ఐపాక్ అని ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోంది. ప్రస్తుతం జనసేన తరుపున సేవలందిస్తున్న వారు పక్క రాష్ట్రాలకు చెందిన వారుగా తెలుస్తోంది. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో జనసేన పరిస్థితి ఏంటి? అక్కడ ఏ పార్టీకి బలం ఉంది? జనసేన గ్రాఫ్ పెరిగిందా? అన్న వివరాలను ఆ సర్వే బృందం తెలుసుకుంటున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా విశాఖ జిల్లాలో జనసేన తరపున ఈ సర్వే జరుగుతున్నట్లు తెలుస్తోంది.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూటు మార్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాలపై ఫోకస్ పెట్టారు. గిరిజన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే మొదట్లో అంతా అంచనా వేయలేకపోయారు కానీ.. పక్కా రాజకీయ వ్యూహంతోనే పవన్ కళ్యాణ్ ఎస్టీ రిజర్వ్డ్ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టినట్లు అర్థమవుతుంది. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచేవారు గిరిజనులు. ఆ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు టర్న్ అయ్యారు. అయితే ఆ ఓటు బ్యాంకు తెలుగుదేశం ఎంత ప్రయత్నించినా వర్కౌట్ కాదు. అందుకే ఆ బాధ్యతలను పవన్ కళ్యాణ్ తీసుకున్నట్టు కనిపించారు. అందుకే తరచూ గిరిజన ప్రాంతాల్లో పర్యటించి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. కొండ శిఖర గ్రామాలకు సైతం రహదారులు నిర్మించారు. వారికి ప్రత్యేకంగా సొంత నిధులతో చాలా రకాల వసతులు కూడా సమకూర్చారు. అటు గిరిజనులు కూడా పవన్ కళ్యాణ్ విషయంలో ప్రత్యేక ప్రేమ చూపుతూ వచ్చారు.ఏపీలో ఆరు ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక పార్లమెంట్ స్థానం ఎస్టిలకు రిజర్వు అయింది. పునర్విభజనతో ఎస్టీ రిజర్వ్డ్ నియోజకవర్గాలు పెరగనున్నాయి. మరోవైపు వచ్చే ఎన్నికల్లో సీట్లు ఎక్కువగా తీసుకోవాలని జనసేన భావిస్తోంది. తెలుగుదేశం పార్టీకి ఎస్టీ రిజర్వ్డ్ నియోజకవర్గాలపై పెద్దగా అంచనాలు లేవు. అందుకే అక్కడ పవన్ కళ్యాణ్ ను ప్రయోగిస్తున్నట్లు అర్థమవుతోంది. ఆయన సైతం తన వద్ద ఉన్న అటవీశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలతో గణనీయంగా అభివృద్ధి చేసి చూపిస్తున్నారు.. గిరిజనులతో మమేకం అవుతున్నారు. అందుకే అక్కడ జనసేన గ్రాఫ్ ఎలా ఉందో తెలుసుకునేందుకు సర్వే సంస్థలను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. అయితే అవసరం అనుకుంటే ఐ ప్యాక్ టీమును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జనసేన భావిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే గతంలో వైసిపికి పనిచేసిన వారు కాకుండా కొత్తవారిని నియమించుకునే అవకాశం కనిపిస్తోంది

# జరాభద్రం... హీట్ స్ట్రోక్ జాగ్రత్త

హైదరాబాద్, ఏప్రిల్? 16,

ఎండలు మండిపోతున్నాయి. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. ఉదయం 9 నుంచే ఎండ విజృంభిస్తుంది. కానీ ఈ సమయంలో చాలామంది ఆఫీస్?లకు వెళ్తూ ఉంటారు. లేదా తప్పనిసరి పనుల నేపథ్యంలో, వివిధ కారణాలతో చాలామంది బయటకు వెళ్లాల్సి వస్తుంది. బస్?లు, పబ్లిక్ ట్రాన్స్?పోర్ట్?లలో వెళ్లేవారికి ఎలాగో కొన్ని ఇబ్బందులు తప్పవు. కానీ బైక్?పై వెళ్లేవారికి ఈ పరిస్థితి కొంచెం దారుణంగా ఉంటుంది. ఎండలో బైక్?పై వెళ్లడమే దారుణం అంటే.. ట్రాఫిక్ ఎక్కువగా ఉండడమనేది డెడ్లీ కాంబినేషన్. నెవర్ బిఫోర్.. ఎవర్ ఆఫ్టర్ రేంజ్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే డీహైడ్రేషన్, అలసట, హీట్ స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఎండలో బైక్ మీద బయటకు వెళ్లేప్పుడు.. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సి వచ్చినప్పుడు కొన్ని ముఖ్యమైన టిప్స్ పాటించాల్సి ఉంటుంది. అవి మీ అందానికి, ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

ఫుల్ కవరేజ్ డ్రెస్సింగ్

మీరు బైక్?పై ప్రయాణిస్తుంటే.. షార్ట్ స్లీవ్స్ కంటే ఫుల్ స్లీవ్స్ షర్టు.. కాటన్ దుస్తులు వేసుకోవడం మంచిది. ఇవి సూర్య కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. చేతులు టాన్ కాకుండా ఉంటాయి.

హెల్మెట్‌తో పాటు స్కార్ఫ్

బైక్? మీద ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలి. హెల్మెట్ వల్ల హీట్ వస్తే అది చెమట రూపంలో జుట్టు, ముఖాన్ని ఇబ్బందులకు గురి చేస్తుంది. కాబట్టి ఆ చెమటను పీల్చుకునేందుకు వీలుగా స్కార్ఫ్ కట్టుకోవాలి. ఇది ముఖం, మెడ కవరయ్యేలా చేసి.. హీట్ తగ్గిస్తుంది.

వాటర్ బాటిల్


ఎండలో బైక్ డ్రైవింగ్ చేస్తే చెమట ఎక్కువగా వస్తుంది. కాబట్టి చిన్న వాటర్ బాటిల్ వెంట తీసుకుని వెళ్లండి. డీహైడ్రేట్ కాకుండా మధ్యలో నీళ్లు తాగుతూ వెళ్లొచ్చు.

ఖాళీ కడుపుతో

బైక్‌పై బయటకు వెళ్లే ముందు తేలికపాటి ఆహారం తీసుకోవాలి. ఖాళీ కడుపుతో వెళ్తే త్వరగా అలసట, బలహీనత వస్తుంది. ఎండ వల్ల ఈ అలసట పెరిగి డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్ వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

సన్ గ్లాసెస్ వాడండి

హెల్మెట్ తలకు రక్షణ ఇస్తుంది. కానీ ఎండ కాంతి కళ్లపై



ప్రభావం చూపకుండా సన్?గ్లాసెస్ పెట్టుకోవాలి. యువి ప్రొటెక్షన్ గ్లాసెస్ ఉపయోగిస్తే కళ్లకు రక్షణ ఉంటుంది. పైగా కాంతి నేరుగా మీ కళ్లను ఇబ్బంది పెట్టకుండా కూలింగ్ ఎక్స్?పీరియన్స్ ఇస్తుంది.

ట్రాఫిక్ ఎక్కువ ఉన్నప్పుడు..

మీరు అనుకోకుండా ట్రాఫిక్?లో సిగ్నల్ వద్ద ఎక్కువసేపు ఆగాల్సి వస్తే బైక్ ఇంజిన్ ఆఫ్ చేయడం మంచిది. ఇది వేడి తగ్గించడంలో సహాయపడుతుంది.

బ్రేక్స్ తీసుకోండి

ఎక్కువ దూరం డ్రైవ్ చేయాల్సి వస్తే.. మధ్యలో బ్రేక్?లు తీసుకోండి. చెట్టు నీడలో లేదా షేడ్‌లో ఆగి కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలి. ఎక్కువసేపు ఎండలో డ్రైవింగ్ చేయడం అస్సలు మంచిది కాదు.

సన్‌స్క్రీన్ తప్పనిసరి

బయటకు వెళ్లే ముందు ఎస్‌పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ కచ్చితంగా అప్లై చేయండి. ఇది సన్‌బర్న్ నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. చర్మ సమస్యలు, స్కిన్ క్యాన్సర్ రాకుండా ఇది హెల్ప్ చేస్తుంది.

హీట్ స్ట్రోక్ లక్షణాలు

మీరు డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు తలనొప్పి, వాంతులు, చెమట ఆగిపోవడం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే విశ్రాంతి తీసుకుని నీళ్లు తాగాలి. ఇవి హీట్ స్ట్రోక్ లక్షణాలు. కాబట్టి ఆ సమయంలో డ్రైవింగ్ చేయడం అంత మంచిది కాదు. హైడ్రేటింగ్ ఫుడ్స్ కూడా హీట్ స్ట్రోక్ లక్షణాలను తగ్గిస్తాయి. కాబట్టి ఎండలో బైక్?పై వెళ్లేప్పుడు ఈ జాగ్రత్తలు తప్పక తీసుకోండి. అలాగే వీలైనంత వరకు అవసరం లేకుంటే ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లడం మానుకోండి. వెళ్లాల్సి వస్తే మాత్రం ఈ చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని గుర్తించుకోండి.

========================

# డీ లిమిటేషన్ బిల్లుతో పీఓకేలో ఎన్నికలు....

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, (న

దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసింది. మహిళా బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లు కూడా ఆమోదించుకొని చరిత్ర సృష్టించాలని కేంద్రం చూస్తుంది. పనిలో పనిగా జమ్ము కశ్మీర్ విషయంలో కూడా అత్యంత కీలకమైన, వ్యూహాత్మక నిర్ణయం తీసుకోనుంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమనే దశాబ్దాల నాటి వాదనను చట్టబద్ధంగా మరింత బలపరిచే దిశగా చర్యలు తీసుకుంటోంది. డీలిమిటేషన్ బిల్లులో అత్యంత ప్రధానమైన అంశం పాక్ ఆక్రమిత కశ్మీర్ నియోజకవర్గాలకు సంబంధించి కీలక ప్రస్తావన ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న జమ్మూకశ్మీర్ భూభాగాలు ఎప్పుడైతే విముక్తి పొందుతాయో అప్పుడే ఆ ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజన చేసే అధికారాన్ని ఈ బిల్లు భారత ఎన్నికల కమిషన్‌కు కట్టబెడుతోంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. ఈ బిల్లు పాక్ ఆక్రమిత కశ్మీర్ తక్షణమే ఎన్నికలు నిర్వహించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వదు. ఇది ఒక భవిష్యత్ కార్యాచరణ. ఆ భూభాగం తిరిగి భారత్ ఆధీనంలోకి వచ్చిన మరుక్షణమే ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రారంభించడానికి అవసరమైన చట్టపరమైన వెసులుబాటును ముందుగానే కల్పిస్తోంది.

అసెంబ్లీ స్థానాలు 90 నుంచి 114కు పెంపు

ఈ బిల్లుతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు 2026ను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ సవరణల ప్రకారం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ నిర్మాణంలో భారీ మార్పులు రానున్నాయి. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో 90 స్థానాలు ఉండగా, పునర్విభజన తర్వాత ఈ సంఖ్య 114 కు పెరుగుతుంది. ప్రస్తుతం పాక్ ఆక్రమిత కశ్మీర్ కోసం 24 స్థానాలను ఖాళీగా ఉంచుతున్నారు. ఈ స్థానాల వల్ల ప్రస్తుతం భారత్ పరిపాలనలో ఉన్న ప్రాంతాల ఓటింగ్ శక్తికి ఎటువంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జమ్ముకశ్మీర్ నుంచి లోక్ స్థానాల సంఖ్యను ప్రస్తుతం 5 నుంచి 7కు పెంచే అవకాశం ఉంది. నామినేటెడ్ ఎమ్మెల్యేల సంఖ్యను ఐదు నుంచి 7కు పెంచరు. వీరిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు కశ్మీరీ వలసదారులు, ఒకరు పాక్ ఆక్రమిత కశ్మీర్ శరణార్థి అయ్యి ఉంటారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కి ఈ నామినేషన్లు చేసే అధికారం ఉంటుంది. ముఖ్యంగా మహిళా సభ్యుల సంఖ్యను రెండు నుంచి మూడుకి పెంచే ప్రక్రియ నియోజకవర్గాల సర్దుబాటు తర్వాతే అమలులోకి వస్తుంది. ఈ బిల్లు రాజకీయ, వ్యూహాత్మక ఎత్తుగడ వెనుక చాలా పెద్ద కథనే ఉంది. హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గతంలో అనేక సార్లు పాక్ ఆక్రమిత కశ్మీర్ విషయంలో స్పష్టమైన ప్రకటన చేశారు. ఆ ప్రాంత ప్రజలే పాకిస్తాన్ పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారని ఎటువంటి బలప్రయోగం లేకుండానే ఆ ప్రాంతాన్ని భారత్ తిరిగి పొందుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా అంతర్జాతీయ వేదికలపై ఆ ప్రాంతం భారత్‌లో అంతర్భాగమని పలుమార్లు నొక్కి చెప్పారు. ఏదో ఒక రోజు భారత్ పూర్తి అధికారాన్ని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే ఇప్పుడు వచ్చిన డీలిమిటేషన్ బిల్లు 2026 ఆ ఆశయాలకు ఒక చట్టపరమైన రూపంగా కనిపిస్తోంది.

=============

# మురుగు నీటికి ఫుల్ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 16,

వ్యర్థ జలాల పునర్వినియోగం కోసం హైదరాబాద్ జలమండలి వినూత్న కార్యక్రమానికి రెడీ అయింది. గేటెడ్ కమ్యూనిటీల నుంచి శుద్ధి చేసిన మురుగునీటిని ఒక్కో ట్యాంకర్‌కు రూ.50-రూ.100 చెల్లించి సేకరించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'ఎరుపు రంగు' ట్యాంకర్లను కేటాయించింది. సేకరించిన నీటిని నిర్మాణాలు, పరిశ్రమలు, పార్కుల నిర్వహణకు వాడడం ద్వారా తాగునీటిపై ఒత్తిడిని తగ్గించాలని జలమండలి అధికారులు భావిస్తున్నారు.సాధారణంగా ప్రజలు జలమండలి నుంచి నీటిని కొనుగోలు చేయడం మనకు తెలుసు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో వేసవి తాపం మె?దలవుగా.. భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో నీటికి డిమాండ్ పెరిగింది. భారీగా ట్యాంకర్లు బుక్ చేస్తున్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. గేటెడ్ కమ్యూనిటీలలోని ప్రైవేట్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని జలమండలి తిరిగి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో ట్యాంకర్ నీటికి రూ.50 నుంచి రూ.100 వరకు చెల్లించేందుకు బోర్డు రెడీ అయింది.హైదరాబాద్‌లోని వివిధ గేటెడ్ కమ్యూనిటీలలో రోజుకు దాదాపు 200 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. ఇందులో తక్కువ నీటిని మాత్రమే గార్డెనింగ్, ఫ్లషింగ్ కోసం వాడుతుండగా.. మెజారిటీ నీరు నాలాల ద్వారా కుంటలు, చెరువుల్లోకి వృథాగా కలిసిపోతోంది. ఈ వృథాను అరికట్టి ఆ నీటిని పునర్వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా జలమండలి కీలక నిర్ణయం తీసుకుంది. శుద్ధి చేసిన ఈ గ్రే వాటర్ సేకరణ కోసం జలమండలి ప్రత్యేకంగా రెడ్ కలర్ ట్యాంకర్లను ప్రవేశపెట్టనుంది. తాగే నీటి సరఫరా కోసం ప్రస్తుతం బ్లూ రంగు ట్యాంకర్లు వాడుతున్నారు. శుద్ధి చేసిన మురుగునీటి కోసం ఎరుపు రంగు ట్యాంకర్లను కేటాయించారు. గేటెడ్ కమ్యూనిటీలు తమ వద్ద ఉన్న నీటిని విక్రయించడానికి జలమండలిని సంప్రదిస్తే.. ఖాళీ ట్యాంకర్ నేరుగా వారి వద్దకు పంపి నీటిని సేకరించనున్నారు.

సేకరించిన నీటి నాణ్యతను పరీక్షించిన తర్వాత.. దానిని తాగేందుకు కాకుండా ఇతర అవసరాలైన భవన నిర్మాణాలు, లాండ్‌స్కేపింగ్, గోల్ఫ్ కోర్స్ నిర్వహణ, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం నగరంలో శుద్ధి చేసిన నీటిలో 2 శాతం కంటే తక్కువే వాడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కొత్త వాటర్ బ్యాంక్ ద్వారా దీనిని 2000 ఎంఎల్డీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాతిపదికన మూడు ట్యాంకర్లతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్‌ను బట్టి వీటి సంఖ్యను పెంచనున్నట్లు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన ఒక సంస్థ ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు వివరించారుప్రస్తుతం హైదరాబాద్ నగరంలో నీటి డిమాండ్ పెరిగిందన్నారు. గతేడాది మార్చిలో 2.1 లక్షల ట్యాంకర్ల వినియోగం ఉంటే.. ఈ ఏడాది ఆ సంఖ్య 2.24 లక్షలకు చేరుకుందన్నారు. ప్రతి రోజూ సరాసరి 7500 ట్యాంకర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డొమస్టిక్ ట్యాంకర్ రూ.500, కమర్షియల్ అయితే రూ.850 చొప్పున వసూలు చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

========================================

# కాంగ్రెస్ తో కలిసి రేవంత్ పనిచేస్తారా

హైదరాబాద్, ఏప్రిల్ 16, (

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులకు దారితీస్తోంది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరిదీ ఒకే విధానంగా కనిపిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కేటీఆర్ విరుచుకుపడుతుండగా, అటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దక్షిణాది హక్కుల కోసం గళం ఎత్తుతోంది.జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన తెలంగాణ వంటి రాష్ట్రాలను సీట్ల పెంపు విషయంలో శిక్షించడం అన్యాయమని కేటీఆర్ అంటున్నారు. ప్రస్తుత పార్లమెంటులో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా ఏ మాత్రం తగ్గకూడదని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఇదే అంశంపై రేవంత్ రెడ్డి కూడా గతంలో ప్రధాని మోదీకి లేఖ రాస్తూ.. దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేలా విభజన ఉండకూడదని స్పష్టం చేశారు. విధానపరంగా ఇద్దరు నేతలు ఒకే తాటిపై ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని రాజకీయ సమీకరణాల దృష్ట్యా వీరు కలిసి పోరాడే అవకాశం మాత్రం శూన్యంగా కనిపిస్తోంది.బిజెపి ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శఇస్తున్నారు. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల ఎజెండాపై నమ్మకం లేదని మండిపడ్డారు. 50 శాతం సీట్ల పెంపుపై ఎక్కడా అధికారిక ప్రకటన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం తెలంగాణకు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర హక్కుల కోసం తాము ఇతర పక్షాలతో కలిసి పోరాడుతామని చెబుతూనే, రేవంత్ రెడ్డిని బీజేపీ ప్రతినిధి గా ముద్ర వేయడం ద్వారా కాంగ్రెస్‌తో కలిసి నడిచే ప్రసక్తే లేదని పరోక్షంగా స్పష్టం చేశారు.మరోవైపు, కాంగ్రెస్ అధిష్టానం కూడా డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాల ఆవేదనను పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థి కావడంతో, వారితో చేతులు కలిపితే తమ రాజకీయ ఉనికి దెబ్బతింటుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే, ఇద్దరి లక్ష్యం దక్షిణాది ప్రయోజనాలు అయినప్పటికీ, ఆ క్రెడిట్ ఎవరికి దక్కాలనే విషయంలో నువ్వా-నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నారు. ఇది కేవలం సిద్ధాంతాల పోరాటం కంటే పవర్ పాలిటిక్స్ గానే ఎక్కువగా కనిపిస్తోంది.డీలిమిటేషన్ అంశం తెలంగాణలో విచిత్రమైన పరిస్థితిని సృష్టించింది. ఒకే సమస్యపై అధికార, ప్రతిపక్షాలు ఒకే మాట మీద ఉన్నా.. గల్లీలో ఉన్న వైరం వల్ల ఢిల్లీలో గళం కలపలేకపోతున్నాయి. ఒకవేళ కేంద్రం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, ఈ ఇద్దరు నేతలు విడివిడిగానే నిరసన గళాలు వినిపిస్తారా లేక రాష్ట్ర ప్రయోజనాల కోసం అనివార్యంగా ఒకే వేదికపైకి వస్తారా అన్నది వేచి చూడాలి. గతంలో తమిళనాడులో స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి ఇద్దరు నేతలు హాజరయ్యారు. ప్రస్తుతానికి మాత్రం ఈ కామన్ పాలసీ కేవలం ప్రకటనలకే పరిమితం కానుంది.

==========================

# మెట్రోతో మినీ ఎలక్ట్రిక్ బస్సుల లింక్

హైదరాబాద్, ఏప్రిల్ 16,

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలోనే ప్రయాణ కష్టాలు తప్పనున్నాయి. ప్రస్తుతం మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా మెట్రో స్టేషన్ల నుంచి మినీ ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తుండగా.. త్వరలోనే మినీ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇక ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చాలా వరకు ఎలక్ట్రిక్ బస్సులే నడుస్తుండగా.. వాటిని ఛార్జ్ చేసేందుకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఆర్టీసీ రెడీ అయింది.హైదరాబాద్ మెట్రో ప్రతి నిత్యం దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతోంది. నగరం ఓ మూల నుంచి మరో మూలకు చేరుకోవాలంటే చాలా మంది మెట్రో ట్రైన్లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఈ మెట్రో సేవలు నగర వ్యాప్తంగా లేకపోవటంతో చాలా మంది మెట్రో దిగిన తర్వాత తమ తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయిస్తుంటారు. అయితే చాలా వరకు మెట్రో స్టేషన్ల సమీపంలో బస్టాండ్లు అందుబాటులో ఉండటం లేదు. చాలా దూరం నడిచి వెళ్లాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ మెట్రో ప్రయాణికులకు తీపి కబురు చెప్పింది. మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు ఫీడర్ సర్వీసులుగా మినీ ఎలక్ట్రిక్ బస్సులను ఉపయోగించాలని ఆర్టీసీ నిర్ణయించింది. మెట్రో స్టేషన్ సమీపం నుంచి ఈ మినీ ఎలక్ట్రిక్ బస్సులను సమీప కాలనీలకు నడపనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి.ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే నడిపేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఆర్టీసీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్రధాన టెర్మినల్ పాయింట్లు అయిన పటాన్‌చెరు, ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, వనస్థలిపురం, గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ కాలనీ, చిలకలగూడ, బాలానగర్, మెహిదీపట్నం, గండిమైసమ్మ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఈ ఛార్జింగ్‌స్టేషన్లు అవసరమని తాజాగా ఆర్టీసీ అదికారులు గుర్తించారు. ఇందుకు 1500 నుంచి 2500 చదరపు మీటర్ల చొప్పున భూమి కావాలని ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. సూచించిన ఆయా ప్రాంతాల్లోని భూములను గుర్తించి జాబితా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆర్టీసీ యాజమాన్యం కోరింది.ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్న సమయంలో లేదా టెర్మినల్ వద్ద ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్లు 10 నుంచి 20 నిమిషాలు పాక్షికంగా బ్యాటరీని ఛార్జ్ చేస్తాయి. దీనినే అపర్చునిటీ ఛార్జింగ్ అని అంటారు. బస్సు రూట్ చివరి పాయింట్ లేదా మధ్యలోని ప్రధాన స్టాప్‌ల వద్ద వీటిని అందుబాటులోకి తీసుకొస్తారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే 300 నుంచి 600 కిలోవాట్ హై పవర్ ఛార్జర్లు ఎలక్ట్రిక్ బస్సులను త్వరగా ఛార్జ్ చేయనున్నాయి. వీటితో పాటు అన్ని బస్సులు ఒకేసారి రాత్రి డిపోలో ఛార్జ్ చేస్తే విద్యుత్ గ్రిడ్‌పై భారం పెరిగే




అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ కేంద్రాలతో ఆ ఇబ్బంది తొలిగిపోనుంది. ఆర్టీసీ బస్సు డిపోకు తిరిగొచ్చిన తర్వాత పూర్తిగా ఛార్జ్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. టెర్మినల్‌లో 10 నుంచి 15 నిమిషాల లేఓవర్‌లోనే టాప్‌అప్ చేసుకొని మళ్లీ ఆయా రూట్‌లోకి వెళ్లొచ్చు. దీని వల్ల బస్సులను ఎక్కువ ట్రిప్పులు తిప్పటానికి అవకాశం ఉండటంతో పాటు సుదూర మార్గాల్లో ప్రయాణ సేవలు అందించొచ్చు.

# మన్సూరాబాద్‌లో అక్రమ నిర్మాణాల దందా!

## అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..


### రాజకీయ అండతో చెలరేగుతున్న వైనం.. నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు





మన్సూరాబాద్, ఏప్రిల్ 16: భారత శక్తి

చట్టాల ఉల్లంఘనలో ఆ నిర్మాణం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. నిబంధనల ప్రకారం ఉండాల్సిన పరిమితులను తుంగలో తొక్కి, భారీ సెల్లార్‌తో అక్రమ నిర్మాణం సాగుతున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అనుమతి ఐదు అంతస్తులకే.. కానీ!

మన్సూరాబాద్ సర్వే నంబరు 23లోని 601 గజాల స్థలంలో స్టిల్ట్ ం 5 అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారు. అయితే, వాస్తవ రూపంలో మాత్రం అక్కడ నిబంధనలకు విరుద్ధంగా భారీ సెల్లార్ నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణ నిబంధనలను (దీ-=బశ్రీవం) బేఖాతరు చేస్తూ సాగుతున్న ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ప్రమాదంలో చిన్నారులు.. భక్తుల అవస్థలు

నిర్మాణం జరుగుతున్న ప్రాంతానికి సమీపంలోనే పాఠశాల ఉండటంతో విద్యార్థులు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అసంబద్ధంగా సాగుతున్న పనుల వల్ల రహదారి ఇరుకుగా మారి, పోచమ్మ గుడికి వచ్చే భక్తులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమ లాభాల కోసం సామాన్యుల భద్రతను పణంగా పెట్టడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు..

ఈ అక్రమ కట్టడంపై మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్, ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు స్థానికులు పలుమార్లు రాతపూర్వక ఫిర్యాదులు చేశారు. అయినా, ఇప్పటి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఉన్నతాధికారుల మౌనం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉ న్నాయా? లేక లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

బేరసారాల్లో 'పెద్దలు'..

ప్రభావవంతమైన రాజకీయ నాయకుల ప్రమేయంతోనే ప్లాట్ యజమాని యథేచ్ఛగా పనులు కొనసాగిస్తున్నట్లు సమాచారం. అధికారులు సైతం 'పై' స్థాయి నుంచి వస్తున్న ఆదేశాలతోనే అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానమని చెప్పే యంత్రాంగం, ఈ విషయంలో మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నిస్తున్నారు.

ప్రజా పోరాటానికి సిద్ధం


అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించని పక్షంలో కాలనీ వాసులందరినీ ఏకం చేసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం మేల్కొని ఈ అక్రమ దందాను అరికడుతుందో లేదో చూడాలి.

# వాణిజ్య ఒప్పందాలపై యువజన కాంగ్రెస్ 'మహాధర్నా'



హైదరాబాద్: ఏప్రిల్16: భారత శక్తి

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తూ ఈనెల 18న (శనివారం) ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విడుదల చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్ శివంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




దేశ ప్రయోజనాలకు విఘాతం:

ఈ సందర్భంగా శివంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారాయని విమర్శించారు. భారత ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడం వల్ల దేశీయ పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో 140 కోట్ల భారతీయుల డేటా భద్రతకు ముప్పు వాటిల్లుతుందని, పాడి రంగాన్ని విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

కార్పొరేట్ల కోసమే ఒప్పందాలు:

రైతులు, కార్మికుల ప్రయోజనాలను పక్కనపెట్టి కేవలం కార్పొరేట్ శక్తుల లాభం కోసమే ఈ ఒప్పందాలు జరిగాయని ఆయన ధ్వజమెత్తారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ ప్రధానిని 'ప్రాణమిత్రుడు' అని సంబోధించడంలోనే ఈ ఒప్పందాల వెనుక ఉన్న అంతర్యం అర్థమవుతోందని పేర్కొన్నారు. ఈ నెల 18న జరిగే ధర్నాకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# రోడ్డు భద్రతపై అవగాహన సూర్యాపేటలో 'అరైవ్ అలైవ్

సూర్యాపేట(భారత శక్తి) ఏప్రిల్ 16: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో న్యూ బస్ స్టాండ్ వద్ద 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అరైవ్ అలైవ్ ప్రోగ్రామ్‌కు ఆటో, క్యాబ్ డ్రైవర్లు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఐ వెంకట్ మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. అతివేగం, అజాగ్రత్త వల్ల ప్రాణాలు కోల్పోవడమే కాకుండా కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంవీఐ విక్రమ్ మాట్లాడుతూ వాహనాల ఫిట్‌నెస్ విషయంలో రాజీ పడకూడదని, ట్రాఫిక్ నిబంధనల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ట్రాఫిక్ ఎస్సై సాయిరాం మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు రవాణా శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: రాష్ట్ర అడిషనల్ డీజీపీ చారు సిన్హా

కరీంనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 16 (భారతశక్తి):

ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా వ్యవహరిస్తే రహదారులపై ప్రమాదాలు జరగకుండా ప్రాణాలను కాపాడుకోకలిగిన వారం అవుతామని విద్యార్థులకు రాష్ట్ర అడిషనల్ డీజీపీ చారు సిన్హా సూచించారు. ఇవేకాకుండా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవని చెప్పారు.

'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సులో భాగంగా

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, సీపీఆర్ పై అవగాహన కల్పించారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్త రోడ్డు భద్రతా వారోత్సవాలు (ఏప్రిల్ 13 నుండి 18 వరకు) జరుగుతున్నాయని, కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పర్యవేక్షణలో గురువారం అస్త్ర కన్వెన్షన్ హాలులో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చారు సిన్హా హాజరై మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు 'డిఫెన్సివ్ డ్రైవింగ్' అత్యంత కీలకమని చెప్పారు. ఒకరి నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు పాటించాల్సిన ప్రధాన అంశాలను ఆవె వివరించారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించడం విస్మరించకూడదు.

ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రాణాపాయానికి సంకేతాలు.మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడటం నేరమని హెచ్చరించారు.

సీపీఆర్ డెమో, కంటి పరీక్షలులి

ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం విద్యార్థులకు అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. అలాగే మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.

ప్రతిజ్ఞ, హెల్మెట్ల పంపిణీ:లి

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరితో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు అడిషనల్ డీజీపీ చేతుల మీదుగా ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు



శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, వేణుగోపాల్, శ్రీనివాస్ జి, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, పలువురు ఇన్స్పెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 16: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం పక్కన నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఉదయం పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, జరుగుతున్న పనుల నాణ్యతను అంచనా వేసి, ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అవసరమైన మార్గదర్శకాలను సంబంధిత అధికారులకు అందించారు.

అలాగే అక్కడ నిర్వహిస్తున్న కబడ్డీ సమ్మర్ కోచింగ్ క్యాంపును సందర్శించి, విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడి వారిని ప్రోత్సహించారు.

ఈ ఇండోర్ స్టేడియంలో 4 షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, యోగా హాల్, ఇండోర్ గేమ్స్ సదుపాయాలు, జిమ్, రైఫిల్ షూటింగ్, స్క్వాష్ కోర్ట్ వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. జిల్లాలో యువతకు క్రీడలు, వినోద కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు మౌలిక వసతుల అభివృద్ధికి



ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియాన్ని అన్ని రకాల క్రీడా సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో ఎన్.వై. గిరి, పబ్లిక్ హెల్త్ డీఈ సంతోష్, కాంట్రాక్టర్ ఏజెన్సీ సభ్యుడు వెంకటరమణ, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత అక్రిడిటేషన్ల జారీకి ఆమోదం

## డిఎంఎసి చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప,ఏప్రిల్ 16(భారత శక్తి ): జిల్లాలోని అర్హులైన 189 మంది జర్నలిస్టులకు రెండవ విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపిందనీ డిఎంఎసి చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ డీఎంఏస్సీ చైర్మన్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.మొదటి విడతలో 538 మంజూరు కాగా రెండో విడతలో 189 మందికి కమిటీ ఆమోదం తెలిపిందనన్నారు.ఇంకా అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మరియు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి సమావేశం లో అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.



ఈ సమావేశం లో ఇంచార్జ్ డీఆర్వో వెంకటపతి,

డిఎంఎసి కన్వీనర్ నెంబర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిని పద్మజ,డివిజనల్ పీఆర్వో సునీల్ సాగర్,

ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి , అసిస్టెంట్ లేబర్ కమిషనర్, రైల్వే పీఆర్వో జనార్ధన్,బ్యూరో చీఫ్ విశాలాంధ్ర పి.రామసుబ్బా రెడ్డి, స్టాఫ్ రిపోర్టర్ ప్రజాశక్తి నూర్ బాషా,స్టాఫ్ రిపోర్టర్ ఈ టివి జి.మురళి మోహన్ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్ హెచ్ యంటివి వి.యం.చంద్ర మోహన్ రాజు,రిపోర్టర్ ఆంధ్రప్రభ ఐ.సి.సుబ్బారెడ్డి,ఎడిటర్ రాయలసీమ సమయం ఏ.సందీప్ కుమార్ రెడ్డి,ఎడిటర్ కొత్త తరంగం కె.రమేష్,స్టాఫ్ రిపోర్టర్ మహా న్యూస్ యు శ్రీకాంత్, కరస్పాండెంట్ ప్రసార భారతి బి.శ్రీనాథ్ రెడ్డి, ఫోటోగ్రాఫర్ ఆంధ్ర జ్యోతి టి.రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల స్థాయి సమావేశం

కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 16: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై, జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి, నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని సూచించారు.

గ్రామ స్థాయిలో ఎదురవుతున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

అనంతరం కలెక్టర్ సర్పంచ్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని కోరారు.

రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శిక్షణలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంతో పాటు, ప్రతి ఇంటికి అవగాహన కల్పించే బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు.

ఆయిల్ ఫామ్ వంటి లాభదాయక పంటలపై రైతులకు ప్రోత్సాహం కల్పించి, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు.

అనంతరం మండల సమాఖ్య సభ్యురాలు మాట్లాడుతూ, మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ అభివృద్ధిలో సంఘాల పాత్ర గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో మహిళలు ఆర్థికంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

కలెక్టర్ చొరవ తో త్వరలో మండలానికి ఆర్టీసీ బస్ రానున్నదని సంతోషం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు స్థిరమైన నివాసం కలగడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఇంతకాలం ఎదుర్కొన్న గృహ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని, తమ కుటుంబాలకు భద్రతతో కూడిన జీవనం అందిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమలాంటి పేదలకు ఇల్లు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే సంబంధిత అధికారులు పథకం అమలులో పారదర్శకతను పాటిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, ఎన్ వి గిరి, డిఆర్ డిఓ సురేందర్, ప్రత్యేక అధికారి సతీష్, డిఎమ్ఎచ్ఓ రవీందర్, తహసీల్దార్ సత్యం, సర్పంచ్ శిరీష, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# జలధార కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, ఏప్రిల్ 16(భారత శక్తి ) : నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల భాగస్వాములతో జలాధార కార్యక్రమాలను మరింత ప్రధాన్యతతో పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఎంపిడివోలను ఆదేశించారు. కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి.. 'జలధార.. నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత' అమలు ప్రణాళిక, అమలుపై.. జేసీ డా. నిధి మీనా, డిఎఫ్ఓ వినీత్ కుమార్ లతో కలిసి సంబంధిత అన్ని మండలాల ఎంపిడివోలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు.

అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారుసాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం, కాలువల పూడికతీత, లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో చెక్ డ్యాములు, రోడ్డు పక్కన ఉన్న కాల్వల డైవర్షన్ వంటి పనులు పనులు చేసి ఉంటే గుర్తించి.. క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులను ప్రతిపాదించాలన్నారు. గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలు, కాల్వలలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగింపు, చెరువులు, కాలువల అనుసంధానం, భూగర్భ జలాల సంరక్షణ కోసం సూక్ష్మ నీటి సాగును ప్రోత్సహించడం స్లూయిజ్ కాల్వల రిపేరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాస్కెట్ ట్యాంక్ లు, తాత్కాలికంగా మల్లింపు చేసిన కాలువలను గుర్తించి రిస్టార్ చేయాలన్నారు.ఈ పనుల్లో ప్రజలు ముఖంగా మహిళా రైతులు, డ్వాక్రా మహిళలు భాగస్వామ్యంతో పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలన్నారు. జలవనరులు శాఖ, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు, డ్వామా తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసే దిశగా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్, డ్వామా పీడి అదిశేషారెడ్డి, స్టెప్ సీఈవో జోయల్




విజయ్ కుమార్, గ్రౌండ్ వాటర్.డిడి మురళీధర్, డిఆర్డీఏ, మెప్మా పిడీలు రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలి

## మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక- మండల సభ -జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 16:

ప్రజల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మునగాల మండల కేంద్రంలోని రైతు వేదిక లో ఏర్పాటు చేసిన మండల సభలో జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామ సభలలో ప్రజా సమస్యలపై అందరూ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమం అందరికి చేరడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గ్రామ, మండల వ్యవస్థ బలోపేతం అయ్యి వేగవంతంగా సేవలు అందించాలని తెలిపారు. సమస్య లేని గ్రామాలు ఉండవని, సమస్యను గుర్తించి సత్వరమే సమస్యకు పరిష్కారం ఏ విధంగా జరుగుతుందో ఆలోచన చేసి వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన అందరికి చేరాలని, చాలా మందికి ప్రభుత్వ పథకాలపై అవగాహన లేదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.200కోట్లతో యాంగ్ ఇండియా స్కూళ్లను నిర్మిస్తుందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్ వివరించారు.మహాలక్ష్మి, గృహ జ్యోతి రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను మండల ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వివిధ పథకాల లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై తల్లిదండ్రులు ఆజాగ్రత్తగా ఉండడం వల్ల చాలా మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. రోడ్డు నియమాల గురించి రోడ్లపై పాటించాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులు ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేయాలని హెల్మెట్ వాడడం సిట్ బెల్ట్ ధరించడం గురించి వివరించాలని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదు అనే విషయం గురించి తల్లిదండ్రులకు లేఖల ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరిస్తామని సీట్ బెల్ట్ పెట్టుకుంటామని మద్యం తాగి వాహనాలు నడపమని తల్లిదండ్రుల నుండి పిల్లలు ప్రామిస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు అందించారు.



ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి.శిరీష, తహసిల్దార్ సరిత ఎంపీడీవో రమేష్ సర్పంచ్ ప్రమీల ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదలను అరికట్టాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 16:

రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం మునగాల మండల పరిధి ఆకుపాముల గ్రామంలోని మాంటిస్సోరీ పాఠశాలలో ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించకుండ నిర్లక్ష్యంగా వాహనాలు నడవటం వల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఎక్కువ మంది మద్యం సేవించి రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందిన వారే ఉన్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపటంతో రోడ్డు ప్రమాదంలో గాయాలై ఆసుపత్రి పాలై మృతి చెందడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నట్లు తెలిపారు. చిన్న తప్పు పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. నేటి యువత రేపటి దేశ భవిష్యత్తు అని రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, తమ కుటుంబ సభ్యులకు, తమ స్థానిక ప్రాంతాల్లోని వ్యక్తులకు రోడ్డు భద్రత నియమాల గురించి తెలియజేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని, పోలీస్ , రవాణా, ఇతర శాఖలు సంయుక్తంగా ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కూల్ బస్సులో ప్రయాణం చేసేటప్పుడు చేతులు బయట పెట్టవద్దన్నారు.రోడ్డు నియమాలు పాటించేలా పిల్లలు తల్లిదండ్రులకు తెలపాలని, రోడ్డు భద్రత నియమలపై స్కూల్ లో పాఠాలు చెప్పాలని స్కూల్ అధికారులను కలక్టర్ సూచించారు



లిహెల్మెట్ సీట్ బెల్ట్ తప్పనిసరి – ఎస్పీ నరసింహలి రోడ్డుపై వాహనాలు నడిపే వారు రోడ్డు నిబంధనలు పటిస్తూ సురక్షితంగా మీమీ గమ్యలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు.రోడ్డుపై బైకులు, స్కూటీలు నడిపే వారు క్రమం తప్పకుండా వాహనము నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. కార్ నడిపే వారు సీట్ బెల్ట్ ధరించకుండా వాహనం నడపరాదు అన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనాలు నడిపే వారు ఇంటి వద్ద మీ కొసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారన్న విషయం గుర్తుంచుకోని వాహనాలు నడపాలన్నారు. వాహనం నడిపే వారు ప్రతి ఒక్కరు రోడ్డు నియమనిబంధనలు పాటించాలన్నారు. రోడ్డుపై నిత్యం జరిగే ప్రమాదాలు హెల్మెట్ లేకుండా వాహనము తోలడం, మద్యం సేవించి వాహనం నడపడం, సీట్ బెల్ట్ వినియోగించకుండా వాహనం నడవడం వల్లనే అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. వాహనాల తనిఖీల్లో పోలీస్ అధికారులను చూసి కొంతమంది వాహనదారులు తప్పించుకొని పారిపోయే క్రమంలో సైతం ప్రమాదాలు జరుతున్నట్లు తెలిపారు. పోలీస్ అధికారులు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటారు తప్ప పోలీస్ అధికారుల మాదిరిగా ఉండరు అన్నారు. ప్రజలు బాగుండడం కోసమే పని చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు, పాఠశాల బస్సు డ్రైవర్లకు, ఉపాధ్యాయులకు, పాత్రికేయులకు హెల్మెట్లు అందించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి బాధ్యతగా సీట్ బెల్ట్ ధరించి అందరికీ సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జిలానీ, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్, ఎస్ఐ అజయ్, స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జాతియ స్థాయిలో మెరిసిన అల్ఫోర్స్ సీబీఎస్ఈ విద్యార్థులు

## విద్యార్థులను అభినందించిన అల్ఫోర్స్ చైర్మన్ వినేందర్

కరీంనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 16(భారతశక్తి):

విద్యార్థులకు పటిష్టమైన ప్రణాళికలతో బోధించినట్లయితే సంచలనాత్మక ఫలితాలను సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో సీబీఎస్ఇ ఫలితాల్లో విద్యార్థులు సంచలనాత్మక విజయాలు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ విద్యార్థుల సన్మానసభకు హాజరై నరేందర్ రెడ్డి మాట్లాడారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు చక్కటి ప్రణాళికలతో, అత్యుత్తమ బోధన సిబ్బందితో అందిస్తూ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక పరీక్షల్లో ప్రశంసనీయమైన మార్కులను సాధింపచేస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ హై స్కూల్ కి చెందినటువంటి విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సాధించడం పాఠశాల గొప్పతనం అన్నారు.

ఈ ఫలితాల్లో103 మంది విద్యార్థులు 500 మార్కులకు గాను 450 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో నూతన చరిత్రను సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. సానిక–494, ఆదిత్య–492, ఎం.శ్రీహిత, ఏ.హర్ష ఢ ఏ.శ్రీనిత 490 మార్కులు, కే.ఓం కార్తికేయ, కె.అస్మిత ఢ కే.అభిజ్ఞ 488 మార్కులు, ఏ.స్వరవిస్తృతి 487 మార్కులు, ఎం.శ్రీగౌరీ 486 మార్కులు, కె.వర్దిని 485 మార్కులు, ఉదయశ్రీ ఢ వి. అభిరామ్ – 484, కే.మోక్స్, జి. సాయి సుశేన్ ఢ ఈ ప్రమేష్ రెడ్డి –483 మార్కులు సాధించారని చెప్పారు. విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో నూరు శాతం మార్కులు ప్రశంసనీయమైనదన్నారు.



ప్రారంభించిన నాటినుండి అల్ఫోర్స్ సీబీఎస్ఇ పై చేయి సాధిస్తుందని, ఈ ఘన విజయాలను సాధించుటకై తోడ్పాటు అందిస్తున్న తల్లిదండ్రులకు, అహర్నిశలు కృషి చేస్తున్నటువంటి సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయిలో మెరిసినటువంటి విద్యార్థులందరికీ అభినందనలు తెలిపి పుష్పగుచ్చాలను అందజేసి రానున్న రోజుల్లో మరిన్ని అద్భుత విజయాలను నమోదు చేసి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన 99 రోజులు.. వేములవాడలో పట్టణ సభశ్రీ

## సంక్షేమ -- అభివృద్ధిపై దృష్టి : చైర్మన్ పుల్కం రాజు వెల్లడి.

వేములవాడ, ఏప్రిల్ 16(భారత శక్తి ):ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో గురువారం పట్టణ సభ నిర్వహించారు. చైర్మన్ పుల్కం రాజు,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పుల్కం రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలపై వివరించారు. ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అల్పాహారం పథకం, ఇందిర కుటుంబ జీవిత బీమా, మధ్యాహ్న భోజనం విస్తరణ, పంటల వైవిధ్యకరణ, సేంద్రీయ వ్యవసాయం వంటి పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు పేదలకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో ?150 కోట్లతో రాజరాజేశ్వర దేవస్థానం అభివృద్ధి, ?46 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ, ?4.20 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ద్వారా పొన్నాల స్వామికి వీల్‌చైర్ అందజేశారు. అయ్యారుపల్లి, పార్వతీపురం అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ ప్యూరిఫైయర్లు అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్.వి. రాధాభాయి, పట్టణ సీఐ వీర ప్రసాద్ , వైస్ చైర్మన్ నరాల శేఖర్, వార్డు కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను పకడ్బందీగా అమలుచేయాలి.

## -అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల,ఏప్రిల్ 16 (భారత శక్తి ప్రతినిధి):

జిల్లాలో నిర్వహించనున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక మండల స్థాయి సమావేశాలను అత్యంత పకడ్బందీగా, ప్రజా పాలన ప్రతిబింబించేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచేలా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్రం లో జిల్లాను అగ్రగామిగా నిలపాలని సూచించారు.మండల స్థాయిలో జరిగే సమావేశాల నేపథ్యంలో గురువారం మేడిపెల్లి మండలంలోని పి.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ లో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేయగ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈరోజు జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వారిగా లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలని సూచించారు. రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు రుణాలు, కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాలు, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై అర్హులైన ప్రజలకు ప్రత్యేకంగా వివరించాలన్నారు.

మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. జగిత్యాల జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టే విధంగా సమావేశాలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, మేడి పెల్లి మండలం స్పెషల్ ఆఫీసర్ సురేంద్ర కుమార్, తహసీల్దార్ మునింధర్, ఎంపీడీవో గంగాధర్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు మాతృదేవోభవ న్యూట్రిషన్ కిట్లను అందజేసిన ఆవుల రాజన్న,

మెదక్ (భారత శక్తి న్యూస్) ఏప్రిల్16: శివ్వంపేట మండలం దొంతి, కొంతన్ పల్లి, దంతన్ పల్లి, ఉసిరిక పల్లి, శభాష్ పల్లి, మల్లుపల్లి, మగ్దాంపూర్, గంగాయిపల్లి, పోతుల బోగూడ, గుండ్లపల్లి గ్రామాల గర్భిణీ స్త్రీలకు సుమారుగా 100 మాతృదేవోభవ న్యూట్రిషన్ కిట్లను నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్, రాజన్న ఫౌండేషన్ చైర్మన్ శ్రీ ఆవుల రాజిరెడ్డి. పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యమని, గర్భధారణ సమయంలో సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్యాన్ని కాపాడడం మన అందరి బాధ్యత అని అన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని, అవసరమైన వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సౌత్ సెంటిమెంట్...

బెంగళూరు, ఏప్రిల్ 16,

నియోజకవర్గాల పునర్విభజన అంశం భారత రాజకీయాల్లో ..ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో పెను తుఫానును సృష్టిస్తోంది. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్ల సంఖ్యను పెంచితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ సున్నితమైన అంశాన్ని ఎలా డీల్ చేయబోతోంది? దక్షిణాదిలో తన పట్టును పెంచుకోవాలని చూస్తున్న కమల దళం, ఈ దక్షిణాది సెంటిమెంట్ 'ను ఎలా శాంతింపజేయగలదు? దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ బలహీనంగా ఉందన్నది కాదనలేని వాస్తవం. కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో ఆ పార్టీ తన ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. ఇలాంటి తరుణంలో, డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే ప్రచారం బలంగా సాగితే, అది ప్రాంతీయ సెంటిమెంట్‌గా మారి బీజేపీకి రాజకీయంగా గండంలా మారుతుంది. తమిళనాడులో స్టాలిన్, తెలంగాణలో రేవంత్ రెడ్డి, కేటీఆర్ వంటి నేతలు ఇప్పటికే దీనిని ఒక అస్తిత్వ పోరాటం గా చిత్రీకరిస్తున్నారు. ఈ సెగను చల్లార్చకపోతే, భవిష్యత్తులో దక్షిణాదిలో విస్తరించాలనే బీజేపీ కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.ప్రస్తుతానికి పార్లమెంటులో సీట్ల సంఖ్యను 816 లేదా 850కి పెంచుతూ బిల్లు తెస్తున్నారు తప్ప ఆ సీట్లను రాష్ట్రాలకు ఏ ప్రాతిపదికన కేటాయిస్తారనే దానిపై స్పష్టమైన ఫార్ములా వెలువడలేదు. జనాభా ప్రాతిపదికన.. పార్లమెంట్ చట్టం ప్రకారం అని చెబుతున్నారు. దీనికోసం కేంద్రం ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నప్పటికీ, విపక్షాల ఆరోపణలకు సరైన సమాధానం చెప్పకపోవడం వల్ల ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. కేవలం జనాభాను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటే ఉత్తరాది రాష్ట్రాల పెత్తనం పెరుగుతుందనే వాదనకు కేంద్రం గట్టి కౌంటర్ ఇవ్వాల్సి ఉంది.బీజేపీ ఈ అంశాన్ని పార్లమెంటు చర్చ ద్వారా ఒక కొలిక్కి తీసుకువచ్చే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నామనే ముద్ర పడకుండా ఉండేందుకు, కేవలం జనాభానే కాకుండా రాష్ట్రాల సామర్థ్యం, ఆర్థిక తోడ్పాటు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని కేంద్రం ప్రకటించే ఛాన్స్ ఉంది. పార్లమెంటు వేదికగా ప్రధాని మోదీ , అమిత్ షా వంటి అగ్రనేతలు దక్షిణాదికి భరోసా ఇస్తే తప్ప ఈ ఆందోళనలు సద్దుమణగవు.భారతదేశం వంటి భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశంలో ఉత్తరాది – దక్షిణాది మధ్య చీలిక రావడం ఏ అధికార పార్టీకి మంచిదికాదు. ముఖ్యంగా ఏక్ భారత్ – శ్రేష్ఠ్ భారత్ అని నినదించే బీజేపీకి ఇది భారీ దెబ్బ. దక్షిణాది సెంటిమెంట్ పెరిగితే, అది జాతీయవాదానికి గండి కొడుతుందని ఆ పార్టీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. అందుకే, సీట్ల పెంపు ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల గౌరవం తగ్గకుండా, ఒక శాస్త్రీయమైన, ఆమోదయోగ్యమైన ఫార్ములాను తీసుకురావడానికి కేంద్రం కసరత్తు చేస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియ అనేది కేవలం అంకెలకు సంబంధించిన విషయం కాదు, ఇది భారత సమాఖ్య స్ఫూర్తికి ఒక పరీక్ష. నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఉత్తరాదికి సీట్లు పెరిగినా, దక్షిణాదికి ఉన్న రాజకీయ ప్రాధాన్యతను కాపాడేలా అదనపు రక్షణ కవచాలు కల్పించడంపై కేంద్రం దృష్టి సారించాలి. త్వరలో జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం ఇచ్చే స్పష్టతనే దేశ రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. దక్షిణాదికి భరోసా ఇవ్వడంలో కేంద్రం విఫలమైతే, అది దేశవ్యాప్త రాజకీయ సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంది.

# దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలేటీ...

న్యూఢిల్లీ, బెంగళూరు, ఏప్రిల్ 16,

రాజ్యాంగ 131వ సవరణ బిల్లు, 2026: దీని ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్య ప్రస్తుతమున్న 543 నుండి 850కి పెరుగుతుంది. ఇందులో రాష్ట్రాల నుండి 815 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 మంది సభ్యులు ఉంటారు.

డీలిమిటేషన్ బిల్లు, 2026: జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చడానికి, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వేషన్లను ఖరారు చేయడానికి ఒక శక్తివంతమైన 'డీలిమిటేషన్ కమిషన్'ను ఇది ఏర్పాటు చేస్తుంది.

కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు, 2026: పెరిగిన సీట్లు, మహిళా రిజర్వేషన్లను కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేసేలా ఈ బిల్లు మార్పులు సూచిస్తుంది.



ఈ ప్రతిపాదనలపై తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనాభాను నియంత్రించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తమకు, ఈ జనాభా ఆధారిత సీట్ల పెంపు అన్యాయం చేస్తుందని అవి భావిస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ దీనిని రాష్ట్ర ప్రయోజనాలపై దాడి అని అభివర్ణించగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇది దేశ సమాఖ్య వ్యవస్థ సమతుల్యతను దెబ్బతీస్తుందని దేశ ప్రధానికి లేఖ రాశారు. జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరగడం వల్ల, భవిష్యత్తులో దేశ రాజకీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కబడుతుందనేది ప్రధాన ఆందోళన. మాజీ కేంద్ర మంత్రి చిదంబరం గణాంకాలతో వివరిస్తూ, ప్రస్తుత నియోజకవర్గాల మార్పు వల్ల దక్షిణాది రాష్ట్రాల వాటా 24.3% నుండి 20.7%కి పడిపోతుందని హెచ్చరించారు. ఇది ఒక దురుద్దేశపూరిత కుట్ర అని ఆయన విమర్శించారు.

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రధాన రాష్ట్రాల్లో సీట్ల మార్పులు ఈ విధంగా ఉండే అవకాశం ఉంది:

తమిళనాడు

ప్రస్తుతం 39 లోక్‌సభ స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 49 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 59 స్థానాలు లభిస్తాయి.

కేరళ

ప్రస్తుతం 20 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 23 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 30 స్థానాలు లభిస్తాయి.

ఆంధ్రప్రదేశ్

ప్రస్తుతం రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 33 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 37 స్థానాలు లభిస్తాయి.

తెలంగాణ

ప్రస్తుతం 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 24 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 25 స్థానాలు లభిస్తాయి.

ఒడిశా

ప్రస్తుతం 21 స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 28 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 31 స్థానాలు లభిస్తాయి.

కర్ణాటక

ప్రస్తుతం 28 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 41 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 42 స్థానాలు లభిస్తాయి. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం 80 స్థానాల ఉండగా, గణనీయంగా 140పైగా లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

ప్రతిపక్షాల వాదన ప్రకారం, కేవలం జనాభా ఆధారంగా చూస్తే తమిళనాడు సీట్లు తగ్గవచ్చు. కానీ ప్రభుత్వం ప్రతిపాదించిన 'దామాషా పద్ధతి'లో అవి పెరిగినట్లు కనిపిస్తున్నా.. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది ప్రాబల్యం తగ్గుతుందనేది వారి అసలు పాయింట్. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న వ్యవస్థ ఇప్పుడు కాలం చెల్లిందని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి మేలు జరిగేలా ఈ బిల్లులను రూపొందించామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. జనాభా అదుపులో ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు కూడా సీట్లు పెరుగుతాయని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ తప్పనిసరి అని, 15 ఏళ్ల పాటు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజల సమస్యలను సభలో వినిపించడానికి సభ్యుల సంఖ్య పెరగడం ప్రజాస్వామ్యానికి అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.సోనియా గాంధీ వంటి అగ్రనేతలు సైతం రాజకీయ ప్రాతినిధ్యంలో వచ్చే ఈ పెనుమార్పులు రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీస్తాయని హెచ్చరిస్తున్నారు. కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా, అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గురువారం నుండి జరగబోయే ఈ మూడు రోజుల సమావేశాలు కేవలం బిల్లుల ఆమోదానికే పరిమితం కాకుండా, ఉత్తర–దక్షిణ భారత రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ, ఆర్థిక అసమానతలపై చర్చకు వేదిక కానున్నాయి. ప్రభుత్వం ఈ ఆందోళనలను ఎలా శాంతింపజేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# త్రిపుల్ ధమాకా.. ఒకేసారి మూడు నెలల కోటా

నల్గొండ, ఏప్రిల్ 16,

తెలంగాణలోని రేషన్ కార్డుదారులకు ఊరటనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ నెలకు సంబంధించి రేషన్ పంపిణీ గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించింది. సాధారణంగా నెల మధ్యలోనే ముగిసే పంపిణీ గడువును, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నెలాఖరు వరకు పెంచుతూ పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసిందవేసవిలో ఎండల తీవ్రత పెరగడం, రాబోయే నెలల్లో వడగాల్పుల ముప్పు ఉండటంతో లబ్ధిదారులు ప్రతి నెలా షాపుల వద్ద క్యూ కట్టకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. ఇందులో భాగంగా ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన కోటాను మొత్తం 18 కేజీల సన్నబియ్యం – నెలకు 6 కేజీల చొప్పున ఈ నెలలోనే ఒకేసారి పంపిణీ చేస్తోంది. దీనివల్ల లబ్ధిదారులు మే, జూన్ నెలల్లో ఎండలో ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. మూడు నెలల సరుకులు ఒకేసారి ఇస్తుండటంతో, ఇప్పుడు తీసుకోకపోతే మళ్ళీ దొరకవేమోనన్న ఆందోళనతో లబ్ధిదారులు భారీగా రేషన్ షాపులకు తరలివస్తున్నారు. దీనివల్ల సర్వర్లపై ఒత్తిడి పెరిగి ఈ–పోస్ (వ–ఖనీూ) యంత్రాలు మొరాయిస్తున్నాయి. ఈ రద్దీని గమనించిన ప్రభుత్వం, లబ్ధిదారులు కంగారు పడాల్సిన పనిలేదని, ఈ నెల 30 వరకు ఎప్పుడైనా సరుకులు తీసుకోవచ్చని స్పష్టం చేసిందిఈ భారీ పంపిణీ వెనుక మరో వ్యూహాత్మక కారణం కూడా ఉంది. కొత్త సీజన్ ధాన్యం సేకరణ ప్రారంభమవుతున్న తరుణంలో, గోదాముల్లో ఉన్న పాత నిల్వలను ఖాళీ చేసి కొత్త ధాన్యానికి చోటు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సరుకుల నిర్వహణను సులభతరం చేయడానికి ఈ అడ్వాన్స్ పంపిణీ ప్రక్రియను చేపట్టింది.మూడు నెలల కోటా కోసం మూడుసార్లు వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదు. ఒక్కసారి ధృవీకరణతోనే మూడు నెలల సరుకులు పొందవచ్చు. గడువు నెలాఖరు వరకు ఉన్నందున, ఉదయం వేళల్లో కాకుండా రద్దీ తక్కువగా ఉండే సమయాల్లో వెళ్లి సరుకులు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఈసారి కూడా నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోంది, కాబట్టి నిల్వ చేసుకున్నా పాడవుతాయన్న భయం అక్కర్లేదు. ప్రభుత్వం తీసుకున్న ఈ గడువు పొడిగింపు నిర్ణయం వల్ల రాష్ట్రంలోని సుమారు 1.05 కోట్ల రేషన్ కార్డుదారులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేదలకు మరియు వృద్ధులకు పెద్ద ఉపశమనం లభించనుంది.

# త్వరలో సంస్థాగత పోస్టులు

హైదరాబాద్, ఏప్రిల్ 16,

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా నెలకొన్న అంతర్గత పరిణామాలు, పాలనాపరమైన నిర్ణయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో అత్యంత కీలకమైన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ భేటీలో పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం, నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం నామినేటెడ్ పదవుల భర్తీ . గత కొంతకాలంగా పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. మరో రెండు రోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న కీలకమైన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం దెబ్బతినకుండా జాబితాను సిద్ధం చేయాలని సీఎం పార్టీ నేతలకు సూచించారు. ఇది కార్యకర్తలలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అధిష్టానం భావిస్తోంది.పార్టీలో అక్కడక్కడా వినిపిస్తున్న అసంతృప్తి స్వరాలపై కూడా మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా ఆరా తీశారు. కొందరు సీనియర్ నేతలు ప్రభుత్వ నిర్ణయాలపై బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, సమన్వయ లోపంపై చర్చించారు. అందరినీ కలుపుకుని వెళ్లాలని, జిల్లాల వారీగా పార్టీ నేతలతో నిరంతరం టచ్‌లో ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడికి సీఎం సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో పార్టీ కేడర్ క్రియాశీలకంగా వ్యవహరించాలని ఈ సమావేశం నిర్ణయించింది.దీనితో పాటు, రాబోయే గ్రేటర్ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే దిశగా వ్యూహరచన చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరును, లబ్ధిదారుల అభిప్రాయాలను పార్టీ యంత్రాంగం సేకరించాలని చర్చించారు. పార్టీ ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్ కేడర్ నుంచి అందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య గ్యాప్ లేకుండా చూసేందుకు క్రమం తప్పకుండా ఇటువంటి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీలో తీర్మానించారు.రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ ముక్కోణపు భేటీ తెలంగాణ కాంగ్రెస్‌లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు, పార్టీలోని అంతర్గత విభేదాలకు చెక్ పెట్టి.. రాబోయే ఎన్నికలకు క్యాడర్‌ను సమరోత్సాహంతో సిద్ధం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే లిస్ట్ సిద్ధమైందని, ఏ క్షణమైనా అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు ధృవీకరిస్తున్నాయి.

## మళ్లీ అమెరికాతో వాణిజ్య చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16

భారత్, అమెరికా వాణిజ్య సంబంధాలపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ నెల చివర్లో ఇరుదేశాలు ముఖాముఖి వాణిజ్య చర్చలను పునఃప్రారంభించనున్నట్లు వాణిజ్య వర్గాలు తెలిపాయి. ప్రధాన సంధానకర్త నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఏప్రిల్ 20 నుంచి అమెరికాలో పర్యటించనుంది. సుమారు మూడు నుంచి నాలుగు నెలల విరామం తర్వాత జరగనున్న తొలి ప్రత్యక్ష సమావేశం కావడం విశేషం. ఈ మధ్యకాలంలో ఇరుపక్షాలు వర్చువల్ విధానంలో చర్చలు కొనసాగించాయి.ఫిబ్రవరి 7న విడుదలైన ఉమ్మడి ప్రకటనకు కొనసాగింపుగా ఈ చర్చలు సాగనున్నాయి. ముఖ్యంగా ఒక చట్టపరమైన వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడంపై దృష్టి పెట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అంతేకాక అమెరికా ప్రారంభించిన వివిధ వాణిజ్య దర్యాప్తులపై కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది. భవిష్యత్తులో వాణిజ్య సమస్యలను ఎలా పరిష్కరించాలి, వాటికి సంబంధించి కార్యాచరణ ఎలా ఉండాలి అనే అంశాలపై ఇరుదేశాలు చర్చించనున్నాయి. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి కాలపరిమితులు, తదుపరి చర్యలను ఉమ్మడిగా నిర్ణయించుకోవడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.ఇదే సమయంలో అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై కూడా కీలక వ్యాఖ్యలు వెలువడ్డాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ వివాదం ముగిసిన తర్వాత చమురు ధరలు భారీగా పడిపోవచ్చని అంచనా వేశారు.. ప్రస్తుతం బ్యారెల్‌కు సుమారు 92 డాలర్ల వద్ద ఉన్న ధరలు యుద్ధం ముగిసిన తర్వాత గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. అమెరికాలో ప్రస్తుతం గ్యాలన్‌కు 4 డాలర్లకు పైగా ఉన్న ఇంధన ధరలు కూడా ఎన్నికల సమయానికి గణనీయంగా తగ్గవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచ చమురు మార్కెట్లు, అలాగే వాణిజ్య చర్చలపై పెట్టుబడిదారులు దృష్టి సారిస్తున్నారు.

# బాధితులకు భరోసా కేంద్రాలు కొండంత అండ



* నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని ఆదేశం
* కరీంనగర్ కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ డీజీపీ చారు సిన్హా

కరీంనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 16(భారతశక్తి): లైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో చేయూతను అందించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు 'భరోసా' కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర అడిషనల్ డీజీపీ (సీఐడీ, ఏసీబీ) చారు సిన్హా పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపల్లిలో ఉన్న 'భరోసా' కేంద్రాన్ని సిపి గౌస్ ఆలంతో కలిసి ఆమె సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలను తనిఖీ చేశారు.

*** రికార్డుల పరిశీలన సిబ్బందికి సూచనలు:**

కేంద్రంలోని ప్రతి విభాగాన్ని సందర్శించిన అడిషనల్ డీజీపీ సిబ్బందితో మాట్లాడి పనితీరును సమీక్షించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయ సహాయం, కౌన్సిలింగ్ అందించడంలో ఏమాత్రం జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.

*** శిక్షల శాతం పెరగాలి:**

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ పోలీసు శాఖలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు



మంచి సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కాగా ఆధారాలను సేకరించి బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన నష్టపరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి" అని అధికారులను ఆదేశించారు. 2024 డిసెంబర్లో ప్రారంభమైన ఈ కేంద్రం, బాధితులకు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులకు తిరిగే ఇబ్బంది లేకుండా ఒకే చోట అన్ని సేవలు అందించడం అభినందనీయమన్నారు. తనిఖీ అనంతరం భరోసా కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటస్వామి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై అనూష, భరోసా కేంద్రం సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది

* వడ్ల కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదు
* ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్




సిద్దిపేట, ఏప్రిల్ 16 (భారత శక్తి ) : యాసంగి సీజన్‌లో వడ్ల కొనుగోలు విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా రైతులకు సకాలంలో సేవలు అందించాలని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ సూచించారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందనీ, రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.ఈ సందర్భంగా చిన్నకోడూరు మండల పరిధిలోని అల్లిపూర్, మాచపూర్ ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, సీసీ వైకుంఠంతో కలిసి ప్రారంభించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సర్టిఫై చేసిన వెంటనే తూకం వేసి రైస్ మిల్లర్లకు పంపించాలని, తాలు కటింగ్ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. అనంతరం మాచపూర్ బీసీ కాలనీలో సర్పంచ్ యట సత్యలక్ష్మి యాదగిరితో కలిసి సీసీ రోడ్డుకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడాలి: జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, ఏప్రిల్ 16(భారత శక్తి ): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భీంగల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈలు, ఎం.పీ.ఓ లు ఇతర అధికారులతో కలెక్టర్ తాగునీరు సరఫరా తీరుతెన్నులపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు చేపట్టడానికి ముందు స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని, చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని, చేతి పంపులకు ఫ్లషింగ్ చేయించాలని అన్నారు. జూన్ లో విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నందున హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ళకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నివాస ప్రాంతాలతో పాటు అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలకు సమృద్ధిగా శుద్ధి జలాలు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఆవాసంలో ఒక్కో నివాస గృహం వారీగా శుద్ధి జలాలు అందేలా నీటి సరఫరా వ్యవస్థను చక్కదిద్దాలని, కుళాయిల బిగింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయించాలన్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పట్టణాలలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎక్కడైనా లోపాలను గుర్తిస్తే వెంటనే వాటిని సరిచేయాలన్నారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, ఎంపీఓలు, ఏ.ఈలు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్ రావు, మిషన్ భగీరథ ఈ.ఈ రాకేష్, నియోజకవర్గం పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఏ.ఈలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

# వేములవాడలో నిలిచిన ఆర్టీసీ కార్గో సేవలు

* వ్యాపారుల పాట్లు.. పట్టించుకోని అధికారులు!




భారత శక్తి, రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 16: జిల్లాలోని అతిపెద్ద ఆధ్యాత్మిక కేంద్రమైన వేములవాడలో గత ఆరు నెలలుగా ఆర్టీసీ కార్గో సేవలు నిలిచిపోవడంపై స్థానిక వర్తక, వాణిజ్య వర్గాలు మరియు వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే ఈ పుణ్యక్షేత్రంలో కనీస రవాణా సౌకర్యమైన కార్గో సేవలు అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వేములవాడ బస్టాండ్ కేంద్రంగా కార్గో సేవలు అత్యంత సమర్థవంతంగా సాగేవి.అయితే, గత ఆరు నెలల నుండి ఈ సేవలను నిలిపివేయడంతో ఏ చిన్న పార్సిల్ వచ్చినా వ్యాపారులు జిల్లా కేంద్రమైన సిరిసిల్లకు వెళ్లాల్సి వస్తోంది.సుమారు 14 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా, అదనపు ఆటో ఛార్జీల భారం పడుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనివల్ల నిత్యావసర వస్తువులు, మందులు మరియు ఇతర అత్యవసర పార్సిళ్ల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ తీవ్రమైన సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించాలని వేములవాడ ప్రజలు కోరుతున్నారు.క్షేత్రస్థాయిలో వ్యాపారులు పడుతున్న ఇబ్బందులపై ఆయన చొరవ తీసుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి, వేములవాడలో కార్గో కేంద్రాన్ని పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఈ ఆధ్యాత్మిక కేంద్రంపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఇక్కడి వ్యాపారలావాదేవీలకు ఆటంకం కలగకుండా కార్గో సేవలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతున్నారు. స్వయంగా రవాణా శాఖ మంత్రి ఉమ్మడి జిల్లాకు చెందిన వారే అయినప్పటికీ, ఆరు నెలలుగా సమస్య పరిష్కారం కాకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే ప్రత్యేక చొరవ తీసుకొని కార్గో సేవలను ప్రారంభించాలని కోరుతున్నారు.


# అంగన్వాడీలో సోలార్ ప్లేట్ల ప్రారంభం

* అంగన్వాడి కేంద్రాల్లో సోలార్ ప్లేట్లు అమర్చి విద్యుత్ ఉత్పత్తి చెయ్యాలి
* మెదక్ ఎంపీ రఘునందన్ రావు
* నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి




మెదక్, ఏప్రిల్16 (భారత శక్తి న్యూస్): అంగన్వాడిలా అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని ప్రతి అంగన్వాడి కేంద్రం వద్ద సోలార్ ప్లేట్లు అమర్చాలని ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సూచించారు. నర్సాపూర్ పట్టణం లోని సాయి కృష్ణ ఫంక్షన్ ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి. జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి హేమా భార్గవి, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి హేమా భార్గవి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు లు మాట్లాడుతూ అంగన్వాడీలు అంచలంచలుగా అభివృద్ధి చెందాలని గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీల ద్వారా పోషక విలువలను తో కూడిన ఆహారాన్ని గర్భిణులకు చిన్నారి విద్యార్థులకు అందించి ఆరోగ్యంగా శారీరక దృఢత్వాన్ని పెంపొందించే విధంగా ఉండాలని అంగన్వాడీల లో సోలార్ ప్లేట్లు అమర్చి విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని ఈ ప్రక్రియను ఐసిడిఎస్ ద్వారా ప్రణాళికను సిద్ధం చేసి అమల్లోకి తీసుకురావాలని గ్రామీణ ప్రాంతాలలో పోషక విలువలను గల ఆహారాన్ని పిల్లలకు గర్భిణులకు అందిస్తూ విశేష కృషి చేస్తున్నందుకు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని ని అభినందిస్తూ, చిన్నారి పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగి ఉన్నత శిఖరాలకు ఎదగడం కోసం అంగన్వాడీల ద్వారా ఈరోజు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం శుభసూచికమన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, ఐ సి డి ఎస్ అధికారులు, అంగన్వాడీ టీచర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి వైషమ్యాలు సృష్టిస్తున్నారు: రామచందర్‌రావు



హైదరాబాద్: డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ''కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ. కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి. సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా జనాభా ఉన్న రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ చేయాలని రాహుల్ గాంధీ కొత్త పార్లమెంట్ భవనంలోనే కోరారు. ఇప్పుడు 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాహుల్ గాంధీకి మించి రేవంత్ జాతీయ నాయకుడిగా ఎదుగుతున్నారు.




# పట్టభద్రులవుతున్న ఎన్.సీ.సీ. క్యాడెట్లకు ఘన వీడ్కోలు

* శిక్షణ పూర్తిచేసుకుని లెఫ్టినెంట్ హోదా పొందిన ఏ.ఎన్.ఓ. అజయ్ కుమార్ కు సత్కారం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 16: హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పట్టభద్రులవుతున్న ఎన్.సీ.సీ. క్యాడెట్లకు గురువారం హృదయపూర్వక వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడలు, ఎన్.సీ.సీ. డైరెక్టరేట్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో, గీతంతో పాటు, దేశానికి వారు అందించిన ఆదర్శప్రాయమైన సేవ, అంకితభావం, క్రమశిక్షణలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు పట్టభద్రులవుతున్న క్యాడెట్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్.సీ.సీ. శిక్షణ యొక్క నిజమైన విలువ కేవలం 'సి' సర్టిఫికేట్ సంపాదించడం వరకే పరిమితం కాదని చెప్పారు. 'ఇది మీకు స్థైర్యం, క్రమశిక్షణ, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందిస్తుంది. ఈ గుణాలే దేశానికి అర్థవంతంగా సేవ చేసేందుకు మీకు మార్గదర్శకంగా ఉంటాయి' అని అన్నారు.రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ గౌరవ అతిథులుగా హాజరై, పట్టభద్రులవుతున్న క్యాడెట్ల అంకితభావాన్ని, వారి సేవను ప్రశంసించారు.ఈ సందర్భంగా, అసోసియేట్ ఎన్.సీ.సీ. ఆఫీసర్ (ఏ.ఎన్.ఓ) లెఫ్టినెంట్ ఎస్. అజయ్ కుమార్ తన శిక్షణను విజయవంతంగా పూర్తిచేసి, లాంఛనంగా ఆ హోదాను స్వీకరించినందుకు అతిథులు ఆయనను అభినందించి, సత్కరించారు.ఈ కార్యక్రమంలో, పట్టభద్రులవుతున్న క్యాడెట్లు తమ ఎన్.సీ.సీ. ప్రస్థానం ఎంత గొప్పదో పంచుకోగా, జూనియర్ క్యాడెట్లు తమ కృతజ్ఞతలు, అభినందనలను తెలియజేశారు. పట్టభద్రులవుతున్న క్యాడెట్లకు జ్ఞాపికలను అందజేశారు.ఎన్.సీ.సీ. విజయాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రత్యేకంగా రూపొందించిన వీడియో, అలాగే మరపురాని క్షణాలను చిత్రీకరించిన ఆడియో విజువల్ ప్రజెంటేషన్, ఈ కార్యక్రమానికి గత స్మృతులను జోడించాయి. క్యాడెట్లు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు, ఆసక్తికరమైన కార్యకలాపాలు ప్రేక్షకుల మన్ననలను పొందాయి.సీనియర్ క్యాడెట్ల వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. అనంతరం గ్రూపు ఫోటో, విందుతో ఈ చిరస్మరణీయ వేడుక ముగిసింది.

# మల్లన్న సాగర్ ముంపు బాధితులకు సమాన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

* కోర్టుకు వెళ్లని ఒంటరి బాధితులు ఇంకా నిరీక్షణలో
* ముంపుతో జీవనాధారాలు కోల్పోయామని ప్రజల ఆవేదన
* ఆర్అండ్ఆర్ కాలనీ కౌన్సిలర్లు కలెక్టర్, ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

సిద్దిపేట, ఏప్రిల్ 16 (భారత శక్తి) : మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ ముంపుతో అన్నీ కోల్పోయామని, ఇప్పుడు న్యాయం కూడా కోల్పోవాలా అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే పరిస్థితుల్లో ఉన్న బాధితులకు వేర్వేరు విధంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సిద్దిపేట జిల్లా మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంతో అనేక గ్రామాలు పూర్తిగా లేదా పాక్షికంగా ముంపుకు గురై, వందలాది కుటుంబాలు తమ భూములు, ఇళ్లు, జీవనాధారాలను కోల్పోయాయి. ప్రస్తుతం పునరావాస కాలనీల్లో నివసిస్తున్న బాధితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు, పురుషులు అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. న్యాయం కోసం కొంతమంది బాధితులు కోర్టును ఆశ్రయించగా, వారికి ఇటీవల రూ.12.54 లక్షల చొప్పున ఆర్థిక సహాయం మంజూరు అయింది. అయితే కోర్టుకు వెళ్లని ఇతర ఒంటరి బాధితులు ఇప్పటికీ అదే సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో కోర్టుకు వెళ్లలేదని, ఇప్పుడు అదే కారణంగా తమకు నష్టం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం ఆర్అండ్ఆర్ కాలనీ కౌన్సిలర్లు మన్యం విష్ణువర్ధన్ రెడ్డి, గుగ్లోత్ రమేశ్, శేరుపల్లి ఉపేందర్ రెడ్డి, కోట బాబు, కొలిచిలిమా భవాని, నర్సింహారెడ్డి సమక్షంలో బాధితులు తమ సమస్యలను వివరించి, సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, ఆర్డీఓ సదానందంకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఒకే పరిస్థితుల్లో ఉన్న ఒంటరి మహిళలు, పురుషులకు వేర్వేరు విధంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లిన వారికి ఇచ్చినట్లే, కోర్టుకు వెళ్లని బాధితులకు కూడా అదే స్థాయిలో రూ.12.54 లక్షల ఆర్థిక సహాయం వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అభివృద్ధి అంటే కేవలం ప్రాజెక్టులు నిర్మించడం మాత్రమే కాకుండా, ముంపుతో అన్నీ కోల్పోయిన ప్రజలకు జీవనోపాధి, భద్రత, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రతి బాధితునికి సమాన న్యాయం చేయడమేనని బాధితులు స్పష్టం చేశారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.








# స్విమ్మింగ్ పూల్‌లో యువకుడు మృతి



* నిర్లక్ష్యంపై ఆరోపణల
* బాధిత కుటుంబం ధర్నా, ట్రాఫిక్‌కు అంతరాయం
* పోలీసుల జోక్యంతో ధర్నా విరమణ

సిద్దిపేట, ఏప్రిల్ 16 ( భారత శక్తి ): సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో స్విమ్మింగ్ పూల్‌లో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన కలకలం రేపింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణంలోని తుప్రాన్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్‌కు వంశీ అనే యువకుడు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు లోతైన ప్రాంతంలోకి వెళ్లి మునిగిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే బయటకు తీసినా, అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన వంశీ మృతి చెందినట్లు తెలిపారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణలో నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని మృతుడి బంధువులు ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ పట్టణంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులను సమాధానపరచి ధర్నాను విరమింపజేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన


* ఫైర్ సేఫ్టీ తప్పనిసరి ఉండాలని సూచన
* ఇంచార్జ్ ఎస్ఎఫ్‌వో ఎల్. సికిందర్

సిద్దిపేట, ఏప్రిల్ 16 (భారత శక్తి): సిద్దిపేట పట్టణంలోని లహరి అపార్ట్మెంట్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జ్ ఎస్ఎఫ్‌వో ఎల్. సికిందర్ హాజరై అపార్ట్మెంట్ నివాసితులకు అగ్ని ప్రమాదాల నివారణపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌వో ఎల్. సికిందర్ మాట్లాడుతూ గృహాలలో గ్యాస్ లీకేజీలు, విద్యుత్ లోపాలు, నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, గ్యాస్ సిలిండర్లను సురక్షితంగా ఉపయోగించాలని సూచించారు.అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలని, ప్రారంభ దశలోనే మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఫైర్ ఎక్స్టింగ్విషర్ల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎలక్ట్రికల్ పరికరాలను జాగ్రత్తగా వినియోగించడం, ఓవర్‌లోడ్‌ను నివారించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. అపార్ట్మెంట్‌లలో ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో బయటపడే మార్గాలను ముందుగానే తెలుసుకోవాలని నివాసితులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ నివాసితులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# బోయిన్‌పల్లిలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

* 32 బైకులు, 100 ఆక్సిటోసిన్ బాటిళ్ల సీజ్

మల్కాజ్ గిరి, ఏప్రిల్ 16 (భారత శక్తి): మల్కాజిగిరి జోన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. జోన్ డీసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో సుమారు 300 మంది పోలీసులు హస్మత్‌పేటలోని పలు ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు నేరాల నియంత్రణే లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగింది.



**అక్రమ వస్తువుల స్వాధీనం**

తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే 100 ఆక్సిటోసిన్ బాటిళ్లు, ఒక కమర్షియల్ గ్యాస్ సిలిండర్, ఒక హుక్కా పాట్‌ను సీజ్ చేశారు. నంబర్ ప్లేట్లు లేని, రోడ్లపై వదిలేసిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**ప్రజల సమస్యల గుర్తింపు**

కేవలం తనిఖీలే కాకుండా, పోలీసులు స్థానికులతో నేరుగా మాట్లాడి పౌర సమస్యలను సేకరించారు. ఈ సమస్యలను ఆయా ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. గంజాయి, బహిరంగ మద్యపానం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు.

**నిఘా ఉంచండి..**

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, కాలనీల్లో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ప్రజల భద్రత కోసం ఇలాంటి తనిఖీలు తరచుగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ, బేగంపేట, తిరుమలగిరి, గోపాలపురం ఏసీపీలు, బోయిన్‌పల్లి సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.



## తేజస్వి సూర్య వ్యాఖ్యలపై

# బీఆర్ఎస్ యువ నాయకుల ఆగ్రహం

సిద్దిపేట, ఏప్రిల్ 16(భారత శక్తి ) : లోక్‌సభలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజనను భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చిన కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట యువ నాయకులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, అమరవీరుల త్యాగాలను అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా జరిగిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించడం అనర్థమని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఆమోదించిన బిల్లులను అదే వేదికపై తక్కువ చేసి మాట్లాడడం దురదృష్టకరమని, తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు దేశ ఐక్యతకు విఘాతం కలిగించేలా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చట్టానికి బీజేపీ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు విభిన్నంగా వ్యాఖ్యలు చేయడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అభివృద్ధిలో ముందంజలో ఉందని పేర్కొన్నారు.భారత్‌లోని రాష్ట్రాలను పాకిస్థాన్‌తో పోల్చడం దేశభక్తికి విరుద్ధమని, ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కోర్టుకు వెళ్లిన వారికి ఇచ్చినట్లే ప్రతి అంశంలో సమాన న్యాయం చేయాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మ రజినీకాంత్ రెడ్డి, సర్పంచ్ నరేందర్ రెడ్డి, యువ నాయకులు బోగారి చరణ్, సామలసాయి ప్రేమ్, బైరి వెంకట్, సతీష్, సాయి గౌడ్, నాగరాజు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు

నిజామాబాద్,ఏప్రిల్ 16(భారత శక్తి ): అన్ని అధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలం గోన్ గొప్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి అనువైన పరిస్థితులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు తరగతి గదులతో పాటు, ల్యాబ్ రూమ్‌లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్.ఓ ప్లాంట్, బోర్ వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ తదితరులు ఉన్నారు.



# 6 గ్యారంటీల అమలుకు రూ.1000 కోట్లకు పైగా వ్యయం

: కలెక్టర్ కే. హైమావతి




సిద్దిపేట, ఏప్రిల్ 16(భారత శక్తి) : రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రజల మరియు రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం 6 గ్యారంటీల అమలుకు రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా మండల స్థాయి సభలు నిర్వహించగా, కొమురవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు 99 రోజులపాటు ఈ కార్యాచరణ కొనసాగుతున్నదని తెలిపారు. గ్రామ స్థాయిలో ఇప్పటికే గ్రామసభలు నిర్వహించగా, మండల స్థాయి సమావేశాలు జరుగుతున్నాయని, మే నెలలో నియోజకవర్గ మరియు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి వారం ఒక శాఖకు సంబంధించిన థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, హెల్త్ వీక్, అరైవ్అలైవ్ ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.రైతులు పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయం చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. జిల్లాలో 25 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా, ప్రతి నెల 6580 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వేలాది ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా, గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి, రైతు భరోసా వంటి పథకాల ద్వారా కోట్లాది రూపాయలు లబ్ధిదారులకు అందుతున్నాయని తెలిపారు. అలాగే మహిళల ఉచిత బస్సు ప్రయాణం, విద్యా రంగ అభివృద్ధి కోసం తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవ బీమా పథకం అమలు చేస్తామని, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విస్తరణతో పాటు అల్పాహారం పథకం కూడా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ రహదారి భద్రతపై, మహిళా శిశు సంక్షేమ శాఖ పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేయించగా, అనంతరం ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: ఎస్పీ మహేష్ బి.గితే.

* వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు వహించాలి.
* విధుల్లో ఉన్న సిబ్బందికి కూలింగ్ గ్లాసెస్ పంపిణీ.



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 16(భారత శక్తి): జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా విధుల్లో ఉండే పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది రక్షణ కోసం జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా, ట్రాఫిక్ విధుల్లో ఉండే అధికారులకు మరియు సిబ్బందికి ఎస్పీ కూలింగ్ గ్లాసెస్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పనిచేసే ట్రాఫిక్ సిబ్బంది, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది తీవ్రమైన ఎండల నుండి తమను తాము కాపాడుకోవాలని కోరారు.విధి నిర్వహణలో ఉన్నప్పుడు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండటానికి క్రమం తప్పకుండా నీరు, గ్లూకోజ్ తీసుకోవాలని సూచించారు. అనంతరం 'అరైవ్ అలైవ్' కార్యక్రమ ప్రాముఖ్యతను వివరిస్తూ.. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై నిరంతరం అవగాహన కల్పించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, అతివేగం మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

# సినిమా

## కృష్ణావతారం మూవీ
## ట్రైలర్ విడుదల



**టాకీస్:** మధురలోని అత్యంత పవిత్రమైన శ్రీ కృష్ణ జన్మభూమి వేదికగా 'కృష్ణావతారం' చిత్ర ట్రైలర్ గ్రాండ్‌గా విడుదలైంది. పవిత్ర పుణ్యక్షేత్రంలో వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగిన ఈ వేడుకతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు హార్దిక్ గజ్జర్ విజువల్ వండర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రంలో శ్రీకృష్ణుడి పాత్రలో సిద్దార్థ్ గుప్తా నటిస్తుండగా, రాధగా సుష్మిత భట్, సత్యభామగా సంస్కృతి జయాన, రుక్మిణిగా నివాషిని కృష్ణన్ కనిపించబోతున్నారు. క్రియేటివ్‌ల్యాండ్ స్టూడియోస్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు అథశ్రీకథ మోషన్ పిక్చర్స్ పతాకాలపై సజన్ రాజ్ కురుప్, శోభా సంత్, పూనమ్ ష్రాఫ్, పార్థ్ గజ్జర్ ఈ భారీ పౌరాణిక చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రకాష్ కపాడియా, రామ్ మోరి, హార్దిక్ గజ్జర్ స్క్రీన్‌ప్లే అందించగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అయనక బోస్ అద్భుతమైన విజువల్స్ అందించారు. మొత్తం మూడు భాగాలుగా రాబోతున్న ఈ సినిమా మొదటి అధ్యాయం మే 7, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## సర్ మరో అవకాశం
## ఇవ్వండి

### బుచ్చిబాబు పోస్ట్.. వైరల్



**టాకీస్:** ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా రామ్‌చరణ్ 'ఎస్క్వైర్ ఇండియా' కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సర్.. మరో అవకాశం ఇవ్వండి' అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో 'పెద్ది' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.




## క్రమశిక్షణే అసలైన బలం

### సాన్యా మల్హోత్రా

టాకీస్: గ్లామర్ ప్రపంచంలో షూటింగ్‌లు, ప్రయాణాలతో సమయం దొరకడమే కష్టంగా ఉంటుంది. అటువంటి బిజీ షెడ్యూల్‌లో కూడా సాన్యా మల్హోత్రా తన వర్కవుట్‌ను ఎలా మేనేజ్ చేస్తోంది? ఆమె ఫిట్‌నెస్ రహస్యం ఏంటి? అనే విషయాలను ఆమె ట్రైనర్ త్రిదేవ్ పాండే తాజాగా వెల్లడించారు. సాన్యా ఫిట్‌నెస్ మైండ్‌సెట్ ప్రతి ఒక్కరికీ ఒక పాఠం అని ఆయన ప్రశంసించారు. సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సాన్యా, తన వర్కవుట్ వీడియోలను తరచుగా షేర్ చేస్తూ ఫాలోవర్లలో ఉత్సాహాన్ని నింపుతుంటుంది.చాలామందికి వర్కవుట్ అంటే కేవలం జిమ్‌కి వెళ్లడం మాత్రమే. కానీ సాన్యా విషయంలో అది ఒక జీవనశైలి. షూటింగ్ ఎంత ఆలస్యమైనా, షెడ్యూల్ ఎంత కఠినంగా ఉన్నా ఆమె తన వ్యాయామాన్ని వదులుకోదు. "సాన్యా లాంటి మైండ్‌సెట్ గనుక మీకు వస్తే, మీరు ఫిట్‌గా ఉండటాన్ని ఎవరూ ఆపలేరు" అని త్రిదేవ్ పాండే ఒక ఇన్‌స్టాగ్రామ్ రీల్‌లో పేర్కొన్నారు. ఫిట్‌నెస్ అనేది కేవలం శరీరానికి సంబంధించింది మాత్రమే కాదు, అది మెదడు యొక్క సంకల్ప బలం మీద ఆధారపడి ఉంటుందని సాన్యా నిరూపిస్తోంది. సాధారణంగా ప్రజలు ఏదైనా పని ఉంటే వర్కవుట్‌ను వాయిదా వేస్తుంటారు. కానీ సాన్యా మాత్రం వర్కవుట్‌ను తన దైనందిన జీవితంలో బ్రష్ చేసుకోవడం, స్నానం చేయడం లాంటి ఒక ముఖ్యమైన పనిగా మార్చుకుంది. ఈ నిలకడ వల్లే ఆమె సంవత్సరాల తరబడి తన అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతోంది. ఆమె వర్కవుట్లలో యోగా, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ మరియు డ్యాన్స్ వంటివి కలగలిసి ఉంటాయి, దీనివల్ల బోర్ కొట్టకుండా వ్యాయామాన్ని ఆస్వాదించవచ్చు. బిజీగా ఉన్నామని సాకులు వెతకడం మానేసి, మనకు ఉన్న సమయంలోనే కనీసం కొద్దిసేపైనా శరీరాన్ని కదిలించడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. సాన్యా మల్హోత్రా ఫిట్‌నెస్ జర్నీ చూస్తే, ఆరోగ్యం పట్ల ఆమెకు ఉన్న అంకితభావం స్పష్టంగా కనిపిస్తుంది.

## ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి

### భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి

**టాకీస్:** రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నేసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన



యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

## 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు

### నటుడు యశ్ ఆసక్తికర విషయం వెల్లడి

టాకీస్: భిన్న నేపథ్యాలున్న కథలతో పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు యశ్. ప్రస్తుతం నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లోనటిస్తున్నారు. దీనితో పాటు.. గీతూ మోహన్ దాస్ డైరెక్షన్‌లో 'టాక్సిక్' చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ రెండు సినిమాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'టాక్సిక్' టీజర్ చూసి అందరూ ఇది గ్యాంగ్‌స్టర్ సినిమా అనుకుంటున్నారని కానీ, ఇది అలాంటి చిత్రం కాదని స్పష్టం చేశారు. జూన్ 4న విడుదల కానున్న 'టాక్సిక్' గురించి యశ్ మాట్లాడుతూ.. 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ సినిమా కాదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. భిన్నమైన ప్రపంచం.. కొత్త కథాంశంతో రానుంది. ఆకట్టుకునే విజువల్స్ ఉన్నాయి. మొదటిసారి ఒక సినిమాను ఇంగ్లిష్‌లో కూడా తెరకెక్కిస్తున్నారు. టీమ్ అంతా ఎంతో ఉత్సాహంగా పని చేస్తోంది. నా అభిమానులు నా నుంచి ఏం ఆశిస్తున్నారో నాకు తెలుసు. అందుకే ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కచ్చితంగా ఇది మిమ్మల్ని అలరిస్తుంది. దర్శకురాలు గీతూ




మోహన్ దాస్‌తో పనిచేయడం చాలా గొప్ప అనుభవం. సినిమాపై స్పష్టమైన విజన్‌తో ఉన్నారు. యాక్షన్ మాత్రమే కాకుండా, బలమైన భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉంటాయని చెప్పారు. ఇక 'రామాయణ' మొదటి భాగం గురించి యశ్ పంచుకున్నారు. 'రణ్‌బీర్ అద్భుతమైన నటుడు. సినిమా విషయంలో మా ఇద్దరి విజన్, ఆలోచనలు ఒకేలా ఉన్నాయి.

## వారణాసి కోసం దేవర సెట్స్ ?

టాకీస్: సూపర్‌స్టార్ మహేష్ బాబు మరియు దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'వారణాసి' సినిమాపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం వారణాసి టీమ్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమా కోసం వాడిన టెక్నికల్ బ్యాక్‌డ్రాప్‌ను ప్రత్యేకంగా అండర్ వాటర్/వాటర్ సెట్స్ వినియోగించబోతున్నట్లు తెలుస్తుంది. 'దేవర' సినిమాలోని సముద్రపు సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద భారీ వాటర్ ట్యాంక్ సెట్‌ను, బ్లూ మ్యాట్ టెక్నాలజీతో రూపొందించారు. ఇప్పుడు అదే సెట్‌ను 'వారణాసి'లో గంగా నది నేపథ్యంలో వచ్చే కీలక సన్నివేశాల కోసం రీ-డిజైన్ చేసి వాడుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ షెడ్యూల్ విదేశాల్లో జరగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ప్రయాణాలు రిస్క్ అని భావించిన రాజమౌళి, తెలివిగా ప్లాన్ మార్చి హైదరాబాద్‌లోనే షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ సెట్‌లో మహేష్ బాబుపై భారీ రివర్ ఛేజ్ మరియు కొన్ని హై-టెక్ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. 'దేవర'లో వాడిన అడ్వాన్స్‌డ్ సినిమాటోగ్రఫీ టెక్నిక్స్ మరియు



వాటర్ షూట్ ఎక్స్‌పర్టీస్‌ను ఈ షెడ్యూల్ కోసం ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

# కరీంనగర్ 'నల్ల' గ్రానైట్.. దర్యాప్తులో ఈడీ నత్తనడక!

కరీంనగర్ ఏప్రిల్ 16 భారత శక్తి: కరీంనగర్ జిల్లాలో పచ్చని గుట్టలను పిండి చేస్తున్న గ్రానైట్ మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పర్యావరణాన్ని నిలువునా ధ్వంసం చేస్తున్నా.. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ (ED), సీబీఐ (CBI)ల తీరు ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. దశాబ్ద కాలంగా విచారణల పేరుతో కాలయాపన చేయడం, నోటీసులకే పరిమితం కావడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు ఏమైనా ఉన్నాయా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఏమిటా ₹750 కోట్ల కుంభకోణం?

2013లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం కరీంనగర్ గ్రానైట్ దోపిడీపై సంచలన నివేదిక ఇచ్చింది. కాకినాడ వంటి ప్రధాన ఓడరేవుల ద్వారా ఎటువంటి అనుమతులు (Transit Permits) లేకుండా, సినరేజి ఫీజులు చెల్లించకుండా లక్షల క్యూబిక్ మీటర్ల గ్రానైట్ విదేశాలకు తరలిపోయింది.

* అక్రమ రవాణా: దాదాపు 7.68 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రానైట్ ను అక్రమంగా తరలించారు.
* విధించిన పెనాల్టీ: నార్మల్ సినరేజి ఫీజు రూ. 125 కోట్లు కాగా, ఐదు రెట్లు పెనాల్టీతో కలిపి మొత్తం *రూ. 749.66 కోట్లు* చెల్లించాలని 126 మంది క్వారీ యజమానులకు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వానికి చుక్కలు: ఇంత భారీ మొత్తంలో కేవలం రూ. 13 కోట్లు మాత్రమే వసూలు కావడం అధికారుల వైఫల్యానికి నిదర్శనం. పెనాల్టీని 1 శాతానికి తగ్గించాలని సదరు ఏజెన్సీలు రివిజన్ పిటిషన్లు వేయడం చూస్తుంటే, వారు చేసిన తప్పును అంగీకరిస్తూనే ప్రభుత్వ ఖజానాకు కన్నం వేయాలని చూస్తున్నట్లు స్పష్టమవుతోంది.

### ఈడీ సోదాలు.. పబ్లిసిటీ స్టంట్లా?

2022 నవంబర్‌లో ఈడీ అధికారులు కరీంనగర్, హైదరాబాద్‌లోని గ్రానైట్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై మెరుపు దాడులు చేశారు. అప్పట్లో ఈడీ విడుదల చేసిన ప్రెస్ నోట్ ఎన్నో ఆశలు కల్పించింది.

* బినామీ ఖాతాల గుట్టు: ఉద్యోగుల పేర్లతో బినామీ ఖాతాలు తెరిచి హవాలా మార్గంలో డబ్బు మళ్లించినట్లు గుర్తించారు.
* చైనా లింకులు: పనామా లీక్స్‌లో ఉన్న చైనా కంపెనీల నుంచి నిధులు మళ్లించినట్లు ఆధారాలు సేకరించారు.
* స్వాధీనం: రూ. 1.08 కోట్ల నగదుతో పాటు 10 ఏళ్ల డేటాను సీజ్ చేశారు.
* ఇంతటి పక్కా ఆధారాలు దొరికినప్పటికీ, ఏడాదిన్నర దాటినా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం విడ్డూరం. 'ఫెమా' (FEMA) ఉల్లంఘనలు జరిగాయని చెప్పిన ఈడీ.. ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తోందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.





### ప్రజాప్రతినిధుల ద్వంద్వ వైఖరి!


నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రానైట్ మాఫియాపై నిప్పులు చెరిగిన నేతలు.. నేడు అధికారం చేతిలో ఉన్నా పెదవి విప్పడం లేదు. ప్రస్తుత కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి గతంలో మైనింగ్ అక్రమాలపై అప్పటి కేంద్ర మంత్రికి ఫిర్యాదులు చేసిన విషయం అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు అదే బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, తన కళ్ల ముందే జరుగుతున్న అక్రమాలపై మౌనంగా ఉండటం మాఫియాకు కొమ్ముకాయడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ప్రకృతి విధ్వంసానికి బదులెవరు?

విచారణ దశలోనే ఉందని అధికారులు కాలక్షేపం చేస్తుంటే, అక్కడ కొండలు కరిగి మైదానాలుగా మారుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ తవ్వకాల వల్ల భవిష్యత్తులో తీవ్ర పర్యావరణ ముప్పు పొంచి ఉంది. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు ఇకనైనా స్పందించి, ఆ ₹750 కోట్ల బకాయిలను వసూలు చేయడంతో పాటు, దోషులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. లేదంటే, ఈ విచారణలు కేవలం పాలకుల ప్రయోజనాల కోసమే అన్న అపవాదు మిగిలిపోక తప్పదు.










రాజ్యసభ సభ్యుడిగా

## వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

* **హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మధుయాష్కి గౌడ్ మరియు మంత్రులు.**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (భారత శక్తి) : రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన నరేందర్ రెడ్డికి వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

### అభినందనల జల్లే..

నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా పార్లమెంట్ భవనంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరితో పాటు ఎంపీ వివేక్ వెంకటస్వామి పాల్గొని ఆయనను అభినందించారు. తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి జితేందర్ రెడ్డి, ప్రభుత్వ



సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ కూడా నూతన ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు.

### పాల్గొన్న ప్రజా ప్రతినిధులు:

ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు మరియు పార్టీ నేతలు భారీగా పాల్గొన్నారు.

* ఎమ్మెల్యేలు: కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రామచంద్ర నాయక్, కవ్వంపల్లి సత్యనారాయణ.
* ఇతర నేతలు: జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని వేం నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## తెలంగాణలో ఠారెత్తిస్తున్న ఎండలు.. ఆదిలాబాద్‌లో 43.8 డిగ్రీల నమోదు

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43.8 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లాలో 42.7, మహబూబ్‌నగర్‌లో 42, రామగుండంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్ర, శనివారాల్లోనూ ఉత్తర, దక్షిణ తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. మరోవైపు ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దిగువస్థాయి గాలుల్లో మార్పు, క్యుములోనింబస్ మేఘాలు, ద్రోణి ప్రభావాలతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

## ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ఎస్టిపి ఏర్పాటు

**ఈ నెల 18న అవగాహన కార్యక్రమం**

**ఎమ్మెల్యే జిఎంఆర్**

పటాన్‌చెరు, ఏప్రిల్ 16 (భారత శక్తి) : ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే అమీన్‌పూర్ పరిధిలో ఎస్టిపి (సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) ఏర్పాటు పై నిర్ణయం తీసుకోనున్నట్లు పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల పరిధిలో 1100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో వ్యయంతో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నంబర్ పరిధిలోని



10 ఎకరాలలో ప్లాంట్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్లాంట్ ఏర్పాటు మూలంగా తమకు దుర్వాసన, అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని సమీప కాలనీల ప్రజలు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం ప్లాంట్ ఏర్పాటు చేయబోయే స్థలంలోనే.. సంబంధిత శాఖల అధికారులు, కాలనీల ప్రజలతో కలిసి సంయుక్త సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు తమకున్న సందేహాలను అధికారులతో కలిసి నివృత్తి చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా అవసరమైన పక్షంలో హైదరాబాదులో ఏర్పాటు చేసిన ఎస్టీపి ప్లాంట్లను సైతం చూపించబోతున్నట్లు తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే తమ తొలి ప్రాధాన్యత అని తెలిపారు. సమావేశానికి కాలనీల ప్రజలందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.



## గజ్వేల్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నికలు

* **నూతన అధ్యక్షుడిగా గుంటుక రవి**
* **ఉపాధ్యక్షులుగా షీర్ల కనకయ్య**

గజ్వేల్, ఏప్రిల్ 16 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో గజ్వేల్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం జరిగాయి.ఈ ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు పలువురు పోటీ పడగా, బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు.ఈ ఎన్నికల్లో గుంటుక రవి భారీ మెజారిటీతో అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా షీర్ల కనకయ్య, చంద్రం, ప్రధాన కార్యదర్శిగా పేర్క రాము, కోశాధికారిగా భాగమొల్ల నర్సింలు ఎన్నికయ్యారు. ప్రధాన సలహాదారులుగా మల్లేశం, క్యాసరం చంద్రం, గౌరవ అధ్యక్షులుగా గాలెంక నర్సింలు, రొడ్డ బాల్ దుర్గయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ తమకు మద్దతు తెలిపిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.



యూనియన్ సభ్యుల సంక్షేమమే తమ ప్రథమ ప్రాధాన్యత అని, కార్మికులకు ప్రభుత్వం అందించే పథకాలు, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యజమానులతో చర్చించి పనికి తగిన న్యాయమైన కూలీ లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను యూనియన్ సభ్యులు, మద్దతుదారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సూరారం రాజు, శ్రీరామ్ రాజు, నర్సి మల్లేశం, గుడారి శ్రీను, తలారి నర్సింలు, కొనాపూర్ రమేష్, వెంకటయ్యతో పాటు గజ్వేల్ మండల తాపీ, సెంట్రింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.